



నేటి దినపత్రిక
# సూర్య
www.suryaa.com
వైఎస్ఆర్ కడప
ఆదివారం 06 జూలై 2025
పేజీలు - 09




# ఓబుజ్జీ..
# ఎవరి తాలుకా?













- వాహనాలపై ఇష్టారీతిన నంబర్‌ప్లేట్స్ ఏర్పాటు
- రవాణాశాఖ నిబంధనలు గాలికి
- కనిపించని రిజిస్ట్రేషన్ నంబర్
- వాహన వివరాలు తెలియకుండా కవర్
- సీఎం తాలుకా.. ఎమ్మెల్యే తాలుకా.. అంటూ కొత్త ట్రెండ్
- సింగిల్‌గా పోటీ చేసిన మగాడు(జగన్) తాలుకా..
- జై తెలుగుదేశం..మంగళగిరి ఎమ్మెల్యే(లోకేష్) తాలుకా..
- ఏపీ సీఎం (చంద్ర బాబు) తాలుకా..
- పిఠాపురం ఎమ్మెల్యే(పవన్)తాలుకా అంటూ నంబర్‌ప్లేట్లు
- కడపలో విస్తరిస్తున్న కల్చర్
- చోద్యం చూస్తున్న రవాణాశాఖ అధికారులు

కడప బ్యూరో - మేజర్‌న్యూస్

వార్త 2 పేజీలో

"తాము సీఎం తాలుకా.. మంత్రి తాలుకా.. ఎమ్మెల్యే తాలుకా.. ఎంపీ తాలుకా.. అంటూ కొత్త ట్రెండ్‌కు తెరలేపారు. బాబు.. వైయస్ఆర్.. జగన్.. పేర్లులా నంబర్లనే డిజైన్ చేయించి తమ వాహనాలపై ఏర్పాటు చేసుకుని మురిసిపోతున్నారు. ఇవన్ని ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధమని తెలిసినా అధికారుల అలసత్వ దోరణితో ఈతరహా నంబర్‌ప్లేట్ల వ్యవహారం శృతిమించుతోంది."


## 10న మెగా పేరెంట్స్
# టీచర్స్ మీట్

**పకడ్బందీగా ఏర్పాట్లు.. విజయవంతం చేయండి**

**మీడియా సమావేశంలో జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి**




**కడప ప్రతినిధి - మేజర్‌న్యూస్ :** ఈ నెల 10వ తేదీన మెగా పేరెంట్స్ - టీచర్స్ సమావేశాలను జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి తెలిపారు. శనివారం స్థానిక కలెక్టరేట్ లోని వీసీ హాల్లో మెగా పేరెంట్స్-టీచర్స్ మీట్ సమావేశాలపై జాయింట్ కలెక్టర్ అదితి సింగ్‌తో కలసి జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి ..మిగతా 2పేజీలో



## నకిలీ కానిస్టేబుల్ పై ఫిర్యాదు

5లో

## ఉక్కు కల సాకారం అయ్యేనా!

8లో

సహజీవనానికి అడ్డు వస్తున్నాడని

# హత్య..



4లో

## జిల్లాలో రక్త కొరతను అధిగమించేందుకు కృషి

### స్వచ్ఛంద సేవా సంస్థలు వెల్లడి

**కడప టౌన్, మేజర్‌న్యూస్:**
రక్తదానంపై అవగాహన పెంపొందించేందుకు, జిల్లాలో రక్త కొరతను తగ్గించేందుకు తమ వంతుగా కృషి చేస్తున్నట్లు స్వచ్ఛంద సేవా సంస్థల ప్రతినిధులు తెలిపారు. కడప జిల్లాలో రెండవ రక్త వారోత్సవాలను ఈనెల 20 నుండి 26 వరకు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. శనివారం కడప ప్రెస్ క్లబ్ సమావేశ మందిరంలో విలేకరుల సమావేశం నిర్వహించారు.పలువురు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొని, రక్తదానం ప్రాముఖ్యతను వివరించారు. రక్త దానం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యతగా తీసుకొని, ప్రతి ఒక్కరు ఈ సేవా కార్యక్రమంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ రక్తదాన శిబిరాలను వికసిత ఫౌండేషన్, జేబీవీఎస్ ది ప్రెజర్వర్ సేవా సమితి, యువ బ్లడ్ డోనర్స్ ఆర్గనైజేషన్, శ్రీ సావిత్రిబాయి పూలే సేవా సమితి, అమృత హస్తం సేవా సమితి, సిఆర్ఐ సుబ్బారెడ్డి చారిటబుల్ ట్రస్ట్, కేర్ క్లబ్ ఫౌండేషన్, వింగ్స్ ఆఫ్ హ్యూమానిటీ వంటి సంస్థలు కలసి సమిష్టిగా నిర్వహించనున్నాయి. ఈ కార్యక్రమంలో స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు అరవింద్, సుబ్బయ్య, అశోక్, నవీన్, సునీల్, దుర్గా, గణేష్ తదితరులు పాల్గొన్నారు

## పేదల భూ సమస్యలు పరిష్కరించలేరా..

### రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరిగిన తమకు న్యాయం జరగడం లేదని రైతు ఆవేదన..

### న్యాయం జరగకపోతే కుటుంబమంతా ఆత్మహత్య చేసుకుంటాం..



**కలసపాడు, మేజర్‌న్యూస్ :** కలసపాడు మండలం కలసపాడు గ్రామం రెవెన్యూ పొలంలో సర్వేనెంబర్ 47-1 లో 2.28 సెంట్లు మరియు 47%-2ఖ% లో రెండు ఎకరాల 71 సెంట్లు భూమిని ఇష్టానుసారంగా రెవెన్యూ రికార్డుల పేర్లు కొట్టేసి తర్జుమా చేసిన రెవెన్యూ అధికారులు గద్దె వీరయ్య సన్నాఫ్ సుబ్బయ్య అనే వ్యక్తికి ముగ్గురు కుమారులు ఉన్నారు. అయినా కూడా నడిపి కుమారుని యొక్క భార్య పేరు సుబ్బలక్ష్మి కొన్నట్టుగా దొంగ అగ్రిమెంట్లు పుట్టించి రెవెన్యూ రికార్డులలో మార్పులు చేర్పులు చేశారు. అయితే పెద్ద కుమారుడైన గద్దె ఈశ్వరయ్యకు సదరు సర్వే నెంబర్లు సొంత బోరు మరియు సొంత ట్రాన్స్ఫారం దీనికి సంబంధించిన డిడి 1994 లోనే సర్వీస్ నెంబర్ 501 నాకు ఇచ్చినారు.ఎన్నిసార్లు ఎంతమంది దగ్గరికి వెళ్లి గగ్గోర్లు పెట్టుకున్నా కూడా పట్టించుకోని రెవిన్యూ అధికారులు అదే కాకుండా వ్యవసాయం మీదనే జీవనం సాగిస్తున్నటువంటి నాకు గత ఐదు సంవత్సరాల క్రితం ఒక కేసు పెట్టి ఆ రెవెన్యూ పొలం మొత్తాన్ని చెట్లు మొలిచే విధంగా చేసి నారు ఈశ్వరయ్య అనే నేను సాగులోకి వెళితే కేసు మీద కేసు పెడతామని నా తమ్ముడైన సుబ్బయ్య బెదిరిస్తున్నారు. ఎన్నిసార్లు ఎం.ఆర్.ఓ. దగ్గరికి వెళ్లి మండల రెవెన్యూ అధికారులకు చెప్పినా కూడా పట్టించుకోని మండల యంత్రాంగం న్యాయం జరగకపోతే మండల రెవెన్యూ కార్యాలయంలోనే పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడతానని ఈశ్వరయ్య తన ఆవేదన తెలపడం జరిగింది.

# ఓ బుజ్జీ.. ఎవరి తాలుకా?




**కడప బ్యూరో – మేజర్‌న్యూస్ :**
ఇటీవల వాహనాల నంబర్ ప్లేట్ విషయంలో యజమానులు విపరీత పోకడలకు పోతున్నారు. రవాణా శాఖ నిబంధనలను గాలికి వదిలి ఇష్టానుసారం వ్యవహరిస్తున్నారు. నంబర్ ప్లేట్ పై నంబరే లేకుండా ఫోటోలు, డిజైన్స్, ఫ్యాన్సీ, అలంకరణ బొమ్మలు.. ఫాంట్‌లతో నింపేస్తున్నారు. ప్రధానంగా యువత ఖరీదైన బైక్ కొని ఫ్యాన్సీ నంబర్ ప్లేట్ ఏర్పాటు చేసుకోవడం ఫ్యాషన్‌గా మారిపోయింది. కాగా, ద్వితీయ శ్రేణి రాజకీయ నేతలు ఒక అడుగు ముందుకేసి తాము సీఎం తాలుకా.. మంత్రి తాలుకా.. ఎమ్మెల్యే తాలుకా.. ఎంపీ తాలుకా.. అంటూ కొత్త ట్రెండ్‌కు తెరలేపారు. బాబు.. వైయస్ ఆర్.. జగన్.. పేర్లులా నంబర్లనే డిజైన్ చేయించి తమ వాహనాలపై ఏర్పాటు చేసుకుని మురిసిపోతున్నారు. ఇవన్ని ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధమని తెలిసినా అధికారుల అలసత్వ దోరణితో ఈతరహా నంబర్‌ప్లేట్ల వ్యవహారం శృతిమించుతోంది. భారతదేశంలో వాహనాల నంబర్ ప్లేట్ నియమాలు చాలా ముఖ్యమైనవి. అన్ని వాహనాలకు నంబర్ ప్లేట్ తప్పనిసరి. ఇది వాహనం ముందు, వెనుక భాగంలో ప్రదర్శించబడాలి. ద్విచక్ర వాహనాల విషయంలో, నంబర్ ప్లేట్ హ్యాండిల్‌బార్‌కు సమాంతరంగా ముందు భాగంలో ఉండాలి. నంబర్ ప్లేట్ యొక్క రంగు, ఫాంట్(అక్షరాలు), పరిమాణం కూడా నియమాల ప్రకారం ఉండాలి. వాహన రకం బట్టి నంబర్ ప్లేట్ సైజురెండు మరియు మూడు చక్రాల వాహనాలు 200-100 మి.మీ., తేలికపాటి మోటారు వాహనాలు లేదా ప్రయాణీకుల కారు 340-200 మి.మీ లేదా 500-120 మి.మీ మధ్యస్థ లేదా భారీ వాణిజ్య వాహనాలు340-200 మి.మీ పొడవు వెడల్పుతో ఉండాలి. హై-సెక్యూరిటీ రిజిస్ట్రేషన్ ప్లేట్ తప్పనిసరి. నంబర్ ప్లేట్‌లు సాధారణంగా తెలుపు నేపథ్యంలో నల్లని అక్షరాలతో ఉంటాయి. ఎరుపు నంబర్ ప్లేట్లు తాత్కాలిక రిజిస్ట్రేషన్‌ను సూచిస్తాయి. మీరు వాహనాన్ని కొనుగోలు చేసిన తర్వాత, దానిని తప్పనిసరిగా ఆర్టీఓ ఆఫీసులో రిజిస్టర్ చేయాలి. శాశ్వత నంబర్ ప్లేట్‌ను పొందాలి. మీరు కొత్త వాహనాన్ని కొనుగోలు చేసినప్పుడు, దానిని ఇంటికి తీసుకువెళ్ళడానికి ఒక రోజు తాత్కాలిక రిజిస్ట్రేషన్ పొందవచ్చు లేదా కొన్ని పరిస్థితుల్లో ఒక నెల వరకు తాత్కాలిక రిజిస్ట్రేషన్ పొందవచ్చు. మీ ద్విచక్ర వాహనాన్ని నడిపే ముందు, నంబర్ ప్లేట్ నియమాలు, నిబంధనలను పాటించడం ముఖ్యం. దేశంలో నంబర్ ప్లేట్ల డిజైన్ నియమాలకు సంబంధించి, ఫ్యాన్సీ నంబర్ ప్లేట్లు, అలంకరణ డిజైన్లు, ఫాంట్‌లు లేదా ఏదైనా వ్యక్తిగత కళాకృతులు అనుమతించబడవు. నంబర్ ప్లేట్‌పై రిజిస్ట్రేషన్ వివరాలు మాత్రమే ఉండాలి. రాష్ట్ర కోడ్, ఆర్టీఓ సంఖ్య, సిరీస్, రిజిస్ట్రేషన్ నాలుగు అంకెల సంఖ్యను కలిగి ఉండాలి. ఇతర అలంకార డిజైన్లు, ఫ్యాన్సీ ఫాంట్‌లు లేదా ఏదైనా వ్యక్తిగత కళాకృతులు అనుమతించబడవు. కానీ ఇటీవల నిబంధనలు తుంగలో తొక్కి నంబర్‌ప్లేట్‌ను ఇష్టారీతిన ఏర్పాటు చేస్తున్నారు. నంబర్ ప్లేట్‌పై నంబరే కనిపించడం లేదు. వాహన యజమానుల ఫోటోలు, సినీహీరోల చిత్రాలు, రంగురంగుల డిజైన్లలో పేర్లు కనిపిస్తున్నాయి. నంబర్ చిన్నదిగా ఏర్పాటు చేస్తున్నారు. నంబర్‌ప్లేట్ పరిమాణాన్ని కూడా తక్కువగా ఏర్పాటు చేస్తున్నారు. రాష్ట్రంలో రాజకీయ పార్టీల నేతలు తాజా ట్రెండ్‌కు తెరలేపారు. తాము టీడీపీకి చెందిన వారమని, వైసీపీకి చెందిన వారమని నంబర్‌ప్లేట్లు వేస్తున్నారు. వాహనానికి చెందిన రిజిస్ట్రేషన్ నంబర్ కనిపించడం లేదు. **తాము మాజీ సీఎం జగన్ మనుషులమని, ముగ్గురికి దడపుట్టించిన మగాడి తాలుకా.., సింగిల్‌గా పోటీ చేసిన మగాడు తాలుకా.., జగనన్న 2.0.., పులివెందుల పులి తాలుకా.. అంటూ వైసీపీ నేతలు, సానుభూతి పరులు తమ వాహనాలపై నంబర్‌ప్లేట్ల స్థానంలో ఏర్పాటు చేస్తున్నారు. అదేవిధంగా జైతెలుగుదేశం, ఆంధ్రప్రదేశ్ సీఎం తాలుకా.., మన నారా..మనలోకేష్.., మంగళగిరి ఎమ్మెల్యే తాలుకా.. అంటూ టీడీపీ నేతలు, సానుభూతిపరులు పసుపు రంగులో నంబర్‌ప్లేట్లు రాయించుకుంటున్నారు. ఇక జనసేన అధినేత, డిప్యూటీసీఎం పవన్‌కళ్యాణ్ పేరుతో అసక్తికర నంబర్‌ప్లేట్లు దర్శనమిస్తున్నాయి. ప్రధానంగా పిఠాపురం ఎమ్మెల్యే తాలుకా.., పోయింది పదవి పార్టీ కాదురా.., మనల్ని ఆపేది ఎవర్రా., పులివేట కొచ్చింది.., ఇది గ్లాస్‌కాదురా..సైన్యం!.. వంటి సినీ డైలాగులతో నంబర్‌ప్లేట్లు కనిపిస్తున్నాయి. గతంలో ఎక్కువగా తూర్పు, పచ్చిమ గోదావరి జిల్లాల్లోనే ఈ ట్రెండ్ కనిపించేంది. రాష్ట్రం మొత్తం విస్తరించింది. కడపలో ఇటీవల కాలంలో ఈ తరహా నంబర్‌ప్లేట్లు ఎక్కువగా కనిపిస్తున్నాయి. కడపలో వైసీపీ నేతలు తమ నాయకుడు జగన్, వైయస్‌ఆర్ పేర్లు వచ్చేలా నంబర్లను డిజైన్ చేయించుకుని వాహనాలకు ఏర్పాటు చేసుకున్నారు. అదేవిధంగా కడప ఎమ్మెల్యే మాధవిరెడ్డి పేరుపైకూడా వాహనాలు కనిపిస్తున్నాయి. కడప ఎమ్మెల్యే తాలుకా.. అంటూ పట్టణంలో పలు వాహనాలు తిరుగుతున్నాయి. ఇలా నేతలపై అనుచరులు తమ అభిమానాన్ని చాటుకుంటున్నారు.** అయితే ఇక్కడ ప్రభుత్వ నిబంధనలు మరచిపోతున్నారు. వాహన రిజిస్ట్రేషన్ నంబర్ కూడా లేకుండా వాహనాలను తిప్పుతున్నా అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదు. ఈ నంబర్‌ప్లేట్ల ద్వారా తాము ఎవరి తాలుకానో చెప్పకనే చెబుతూ అధికారులను భయబ్రాంతులకు గురి చేస్తున్నారు. వాహనాల ముందు, వెనుకాల పార్టీల పేర్లతో, నేతల ఫోటోలతో నింపేస్తున్నారు. కానీ ఇలా ఏర్పాటు చేసుకున్న వారందరికి ఆయా నేతలు సన్నిహితమని చెప్పలేం. కానీ అధికారులు మాత్రం తమకెందుకు? అన్నట్లు వ్యవహరిస్తున్నారు. అటువంటి వాహనాలపై కన్నెత్తి కూడా చూడటం లేదు. ఇప్పటికైనా రవాణాశాఖ అధికారులు స్పందించాలి. పోలీసుల సహకారంతో వీటిని కట్టడి చేయాల్సిన అవసరం ఎంతైనా వుంది. నిబంధనల ప్రకారం వాహనాలకు నంబర్‌ప్లేట్లు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలి.

## కేసి కెనాల్ పై అక్రమ కట్టడం తొలగింపు

### సూర్య కథనానికి స్పందన

**చెన్నూరు,మేజర్‌న్యూస్:** చెన్నూరులోని స్టేట్ బ్యాంకు ఎదురుగా ఉన్న భూములలో స్థలాలు కొనుగోలు చేసిన స్థలం తోపాటు పక్కనే ఉన్న కేసి కాలువకు చెందిన స్థలంలో మిగతా భూములలోకి వెళ్లకుండా అక్రమ కట్టడం చేశారు.చెన్నూరు కేసీ కెనాల్ పరిధిలోని 836.A-2 సర్వేనెంబర్లో తన 26 సెంట్లకు రస్తా కావాలని తనకు రస్తా లేకుండా కేసి భూమిని ఆక్రమించి అక్రమ కట్టడాలు జరిగాయని వాటిని తొలగించి తన భూమికి రస్తా ఇప్పించాలని చెన్నూరుకు చెందిన రైతు అంబవరం భాస్కర్ రెడ్డి గత ఏడాది జులై నెలలో గ్రీవెన్స్ ద్వారా కలెక్టర్ కు అర్జీ ఇవ్వడం జరిగింది.దీంతో స్పందించిన గ్రీవెన్స్ అధికారులు జిల్లా కేసీ కెనాల్ అధికారులకు,చెన్నూరు తహసీల్దార్, స్థానిక పంచాయతీ కార్యదర్శి అధికారులకు దీనిపై విచారణ జరిపి అక్రమ కట్టడాలు ఉంటే తొలగించాలని ఆదేశాలు జారీ చేశారు. దీంతో ఎట్టకేలకు స్పందించిన మండల అధికారులు,కేసి కెనాల్ అధికారులు కలిసి అప్పటి మండల సర్వేయర్ సోమశేఖర్ ఆధ్వర్యంలో 20-8-2024వ తేదీన కొలతలు వేసి అక్రమ నిర్మాణం జరిగిందని ఎంత వరకు ఆక్రమణకు జరిగిందో అంత వరకు కొలతలు వేసి మార్కింగ్ ఇచ్చారు.ఈ విషయంపై అక్రమదారునికి అక్రమ నిర్మాణాలను తనే తొలగించుకుంటారా లేక ప్రభుత్వం అధికారులతో తొలగించాల్సి ఉంటుందని రెండు నెలల క్రితం నోటీసులు జారీ చేశారు.పది రోజుల సమయం తీసుకుని ఏదో ఒక నిర్ణయం తీసుకోవాలని సదరు ఆక్రమణదానికి స్థానిక అధికారులు చెప్పారు.ఆక్రమణ జరిగిందని కొలతలు



వేసి మార్కింగ్ ఇచ్చి 9 నెలలు గడుస్తున్నా మండల స్థాయి అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం పై అంబవరం భాస్కర్ రెడ్డి నేటి దినపత్రిక సూర్య ప్రతినిధిని సంప్రదించడంతో జూన్ 2న సూర్య దినపత్రికలో "కేసి అక్రమ నిర్మాణాలు తొలగింపు అమలు జరిగేనా...?" అనే శీర్షిక ప్రచురించిన సంగతి పాఠకులకు విదితమే ఈ శీర్షిక పై స్పందించిన అధికారులు శనివారం రెవెన్యూ, పంచాయతీ, కేసి కెనాల్ శాఖల అధికారులు సమన్వయంతో పోలీసుల సహకారంతో అక్రమ కట్టడాన్ని తొలగించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎవరైనా ప్రభుత్వ స్థలాలలో అక్రమ కట్టడాలు నిర్మిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ఈ సందర్భంగా తనకు రస్తా కల్పించి ప్రభుత్వ ఆస్తులు కాపాడిన అధికారులకు అంబవరం భాస్కర్ రెడ్డి ధన్యవాదములు తెలిపారు.డిప్యూటీ ఎంపిడిఓ సురేష్ బాబు,కేసి కెనాల్ ఏఈ గంగిరెడ్డి,వర్క్ ఇన్స్పెక్టర్ బాషా,పంచాయతీ కార్యదర్శి రామ సుబ్బారెడ్డి,వీఆర్వోలు భాస్కర్ రెడ్డి,రసూల్,పోలీసులు, సర్వేయర్ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ కైవల్య సత్సంగ్ 15వ శ్రీ గురుపూజ వార్షికోత్సవాలు

**ప్రొద్దుటూరు, మేజర్‌న్యూస్:** శ్రీ కైవల్య సత్సంగ్ 15వ వార్షికోత్సవం సందర్భంగా స్థానిక లైట్ పాలెం సెంటర్ లోని శ్రీ కైవల్య సత్సంగ్ ఎం.వి.ఎస్. ధ్యాన మందిరంలో ఆషాఢ శుద్ధ ఏకాదశి ఆదివారం నుండి 10వ తేది వరకు 5 రోజులపాటు గురుపూజ ఉత్సవాలు జరుగుతాయని శ్రీ కైవల్య సత్సంగ్ శిష్య బృందము తెలిపారు. ప్రతి రోజు ఉదయం 8.30గం నుండి 1గం వరకు, సాయంత్రం 5 గంటల నుండి 8 గంటల వరకు శ్రీ కైవల్య సత్సంగ్ వ్యవస్థాపక అధ్యక్షులు కైవల్య తీర్థ స్వామి, గురుమాత, మాతృశ్రీ జ్ఞానేశ్వరమ్మ, గురువుల విశిష్ఠత గురించి, ఉపనిషత్తుల సారాంశాలపై కూలంకశంగా 5రోజులు ఉపన్యసిస్తారని, శిష్య బృందము సభ్యులు తాము గురువుల ద్వారా స్వీకరించిన జ్ఞానమును తెలియ చేస్తారని వివరించారు. శ్రీ శంకర భగవత్పాదులు రచించిన గురుపాదుకాస్తవము, గురోరష్టకము, గురుపాదుకా స్తోత్రము, దక్షిణా మూర్తి స్తోత్రము, గురు గీతా, అమృత బిందూపనిషత్, మొదలైనవి 5 రోజులు పారాయణం, ధ్యానం, ఉపన్యాసాలు ఉంటాయని తెలిపారు. 7వ తేదీ మూల గురువులైన శ్రీ వేదాంతం లక్ష్మణార్యుల వారి 50వ ఆరాధన ఉత్సవాల సందర్భంగా గురువు ధ్యాన సూక్ష్మాలు అనే చిరు పుస్తకం శ్రీ కైవల్య తీర్థ స్వామి వార్ల స్వహస్తాలతో ఆవిష్కరించబడునని వివరించారు. గురువు శిష్యబృంద సభ్యులు ఆదోని, ఎమ్మిగనూరు, కర్నూలు, నంద్యాల, రేపల్లె నుండి గురు పూజ వార్షికోత్సవాలను ఘనంగా నిర్వహించుటకు వస్తున్నారని తెలిపారు. శ్రీ వేదవ్యాస మహర్షుల స్మృతి చిహ్నముగా ప్రతి సంవత్సరం ఆషాఢ మాస గురు పౌర్ణమి సందర్భముగా గురు పూజ ఉత్సములను నిర్వహిస్తామన్నారు.

## అనాథ వృద్ధులకు ఉచిత వైద్య శిబిరం..!

### డాక్టర్ దాసరి శీను



**బద్వేల్, మేజర్‌న్యూస్ :** బద్వేల్ పట్టణంలోని డాక్టర్ దాసరి శ్రీను హాస్పిటల్ వారి ఆధ్వర్యంలో శనివారం పట్టణంలోని ఆనంద నిలయం నిరాశ్రయుల ఆశ్రయంలో ఉన్నటువంటి అనాథ వృద్ధులకు, వికలాంగులకు, ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీను మాట్లాడుతూ వారికి మా హాస్పిటల్ తరఫునుంచి ఉచిత వైద్య శిబిరం ద్వారా వారికి సేవలు అందించడం మా పూర్వజన్మ సుకృతం అని ఆయన అన్నారు. ప్రస్తుత పరిస్థితిలో అనారోగ్య పాలవుతే వేలాది రూపాయలు వేచించి జబ్బును నయం చేసుకోవడం పరిపాటిగా మారింది నిరుపేదలైనటువంటి అనాథ వృద్ధులు ఏమైనా ఆరోగ్య సమస్యలు వస్తే వేలాది రూపాయలు వేచింది జబ్బు నయం చేసుకోలేరని ముఖ్య ఉద్దేశంతో డాక్టర్ దాసరి శ్రీను హాస్పిటల్ వైద్యులైన, డాక్టర్ యం.బి.బి.ఎస్. యం.డి. ఫిజిషియన్ దాసరి ధరణి ఇంద్రనీలమణి, డాక్టర్ యంపిటి, బిపిటి, యం.ఐ. ఏ.పి. భరణి శ్రీ హంసిని వారి ఆధ్వర్యంలో, వృద్ధఆశ్రయంలో ఉన్నటువంటి వృద్ధులను పేరు పేరునా పలకరిస్తూ, వారి ఆరోగ్య సమస్యలను తెలుసుకొని, బీపీ షుగర్ మరియు సాధారణ వ్యాధులకు ఉచిత వైద్యాన్ని అందించ మన్నారు. వారికి అవసరమైన మేరకు నాణ్యమైన మందు లను ప్రతి ఒక్కరికి అందజేశామన్నారు. అదేవిధంగా వారికి ఆరోగ్యం పట్ల పలు రకాల సూచనలు వ్యక్తిగత శుభ్రత గురించి సలహాలు ఇస్తూ, ఇక్కడ ఉన్నటువంటి వృద్ధులను ప్రేమతో ఆప్యాయతతో పలకరిస్తూ, మెరుగైన వైద్యం అందించినందుకు. వారికి ఆశ్రమంలోని వృద్ధులుప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆశ్రమ నిర్వాహకులు పిడతల రవికుమార్ మాట్లాడుతూ నిరుపేదలైన అనాథ వృద్ధులకు ప్రత్యేక చొరవ తీసుకొని వైద్య శిబిరం నిర్వహించిన డాక్టర్ శీను వైద్యశాల డాక్టర్లకు వైద్య సిబ్బందికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ దాసరి శీను మరియు వైద్యసిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కష్టాల నుంచి 'జ్ఞానపీఠ' వరకు రావూరి పయనం

### భరద్వాజ జయంతి సందర్భంగా నివాళులు




**కడప టౌన్ మేజర్ న్యూస్:** కూలీగా, వ్యవసాయ కార్మికునిగా ప్రారంభించి అనేక కష్టాలను అధికమించి, కేవలం ఏడవ తరగతి వరకే చదివినా అనేక రకాల వ్యక్తిత్వాలను ఆకలింపు చేసుకుని గొప్ప సాహిత్యాన్ని సృష్టించి, అత్యున్నత జ్ఞానపీఠ పురస్కారాన్ని అందుకున్న రావూరి భరద్వాజ సాహితీ లబ్ద ప్రతిష్టులని వైయస్సార్ జిల్లా రచయితల సంఘం అధ్యక్షులు ఆచార్య మూల మల్లికార్జున రెడ్డి అన్నారు. శనివారం స్థానిక కడప పెన్షనర్స్ ఆఫీసులో వైయస్సార్ జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో రావూరి భరద్వాజ 99వ జయంతిని ఘనంగా నిర్వహించారు. మొదట రావూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.అనంతరం ఆయన మాట్లాడుతూ రావూరి వారి జీవితంలో ఎన్నో ఆటుపోట్లు, ఒడిదుడుకులు ఉన్నా స్వయంకృషితో ఎదిగిన గొప్ప సాహితీ వృక్షమని కొనియాడారు.భరద్వాజ కలం నుండి దాదాపు 200 పైగా కథలు, నవలలు,నాటకాలు, పద్యాలు, స్మృతి కావ్యాలు వెలుపడ్డాయని,ఆయన సినిమాల్లో తెర వెనుక జరుగుతున్న చీకటి కోణాల్ని స్పృశించి, వర్ణించి రాసిన 'పాకుడు రాళ్లు 'నవలకు జ్ఞానపీఠ సత్కారం లభించిందని తెలిపారు.విశ్రాంత ఉపాధ్యాయులు డాక్టర్ వెల్లాల వెంకటేశ్వరాచారి మాట్లాడుతూ భరద్వాజ పాకుడు రాళ్లు తర్వాత ఆయన రాసిన జీవన సమరం కూడా ప్రసిద్ధమైన రచనని, బాల సాహిత్యానికి అతను చేసిన సేవ ఎనలేనిదని, ఆయన ఏడవ తరగతి వరకు చదివిన ఆయన రాసిన రచనలు ఎంఏ విద్యార్థులకు పాఠ్యాంశాలుగా రావడం ఆశ్చర్యాన్ని కలిగిస్తుందని చెప్పారు. విశ్రాంత డిప్యూటీ డీఈవో నాగ ముని రెడ్డి ప్రసంగిస్తూ చిన్న వయస్సులోనే ఇంటి నుండి బయటకు వచ్చి వివిధ ప్రాంతాల్లో, వివిధ వ్యక్తులతో తిరగడం వల్ల ఆయన వ్యక్తుల మనస్తత్వాలు క్షుణ్ణంగా అవగాహన చేసుకున్నారని, అందుకే అతను ఏ రచన చేసినా అది ప్రజలను ఆలోచింప చేసే విధంగా ఉంటుందన్నారు.ఈ కార్యక్రమంలో ఏవీఎస్ రాజు, నారాయణ, వెంకటసుబ్బయ్య, సుభాన్, రామకృష్ణ, సుబ్బిరెడ్డి పాల్గొన్నారు


## సచివాలయ సిబ్బందిని సత్కరించిన ఎంపిటిసి రమేష్ వైసిపి నాయకుడు నారాయణ




**కలసపాడు, మేజర్‌న్యూస్ :** కలసపాడు మండలం లోని లింగా రెడ్డి పల్లే సచివాలయం సిబ్బంది. గత 5 సంవత్సరాలుగా లింగారెడ్డి పల్లె పంచాయితీ నందు సేవలు అందించి, బదిలీ పై వెళ్తున్న సచివాలయ సిబ్బంది కి పంచాయితీ తరుపున సన్మానం చేసిన, సర్పంచ్ భర్త నారాయణ, ఎంపీటీసీ సగిలి రమేష్.లు అభినందనలు తెలిపారు అనంతరం ఈ సందర్భంగా ఎంపిటిసి రమేష్ మాట్లాడుతూ బదిలీ పై వెళ్తున్న సిబ్బంది అందరికీ పేరు పేరునా ధన్యవాదాలు తెలుపుతు మీరు పంచాయితీ లో అందించిన సేవలు మరువలేనివి, అని కొనియాడారు, గత 5 సంవత్సరాలుగా మీరు అందించిన సేవలు ప్రజలకు మేలు జరిగినవని అభినందించారు.

## ఇది ప్రజా సంక్షేమ ప్రభుత్వం

### ఇంటింటికి ప్రచారంలో టిడిపి నగర అధ్యక్షుడు శివ కొండారెడ్డి




కడప రూరల్, మేజర్‌న్యూస్: ఇది ప్రజా సంక్షేమ ప్రభుత్వమని, ఎన్నికల్లో ఇచ్చిన హామీల అమలులో నూటికి నూరు శాతం అమలు చేయడం ప్రభుత్వ ముఖ్య లక్ష్యం అని టిడిపి నగర అధ్యక్షుడు శివ కొండారెడ్డి పేర్కొన్నారు. నగరంలోని ఏడవ డివిజన్లో శనివారం తెలుగు వాణిజ్య విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవిశంకర్ రెడ్డితో కలిసి సుపరిపాలన లో తొలి అడుగు, ఇంటింటి కార్యక్రమాన్ని నిర్వహించారు. కూటమి ప్రభుత్వం అమలు చేసిన పథకాల కరపత్రాలను పంపిణీ చేసి, ఆర్టీసీ ఉచిత ప్రయాణం మహిళలకు ఈ ప్రభుత్వం ఆగస్టు 15 నుండి అమలు చేస్తుందని ఆయన చెప్పారు. గత పాలనలో రాష్ట్ర అభివృద్ధి నిర్వీర్యం అయ్యిందని, ప్రజా సంక్షేమం పడకేసిందని గత ప్రభుత్వ పాలనను ఆయన విమర్శించారు. రాష్ట్రం అన్ని విధాల అభివృద్ధి సాధిస్తుందని, యువతకు ఉపాధి పరిశ్రమల స్థాపన ద్వారా లభిస్తుందని, ఈ ప్రభుత్వ పాలన పట్ల ప్రజలు సంతోషాన్ని వ్యక్తపరుస్తున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో నక్కల శివరాం, ప్రేమ్ కుమార్, జానారెడ్డి, స్థానిక టిడిపి కార్యకర్తలు పాల్గొన్నారు.

## మండల సర్వసభ్య సమావేశం



**మైదుకూరు, మేజర్‌న్యూస్ :** స్థానిక ఉపాధి కార్యాలయంలో ఎంపీపీ థామస్ అధ్యక్షతన ఎంపీడీవో శ్రీధర్ నాయుడు ఆధ్వర్యంలో మండల సర్వసభ సమావేశం జనరల్ బాడీ మీటింగ్ జరిగింది, మండలంలోని సర్పంచులు, ఎంపీటీసీలు మండలంలో ఉన్న ఆయా శాఖల అధికారులతో కలిసి సమావేశం నిర్వహించారు. గతంలో పనిచేసిన, చేయవలసిన పనులు అభివృద్ధి పై చర్చించారు. ప్రతి గ్రామంలోనూ పారిశుద్ధ్యం, టీచర్ల కొరత, రోడ్లు, నీటి తదితర సమస్యల పై సర్పంచులు, ఎంపీటీసీలు గళం ఎత్తారు. కొన్ని శాఖల మండల అధికారులు రాకపోవడంతో సమస్యలు ఎలా తిరుతాయని సర్పంచులు, ఎంపీటీసీలు ఆగ్రహించారు. ప్రతినిధులు లేవనెత్తిన సమస్యలను జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యలు పరిష్కరిస్తామని మండల ఎంపీడీఓ హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ లక్ష్మి ప్రసన్న, సర్పంచులు మాచిరెడ్డి శ్రీనివాసులు రెడ్డి, లెక్కల జయభారత్ రెడ్డి, బండి ప్రసాద్, భాస్కర్ రెడ్డి, ఎంపీటీసీ దసరథరామిరెడ్డి పాల్గొన్నారు.

## శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామిని దర్శించుకున్న సినీనటి ఆమని



**బ్రహ్మంగారిమఠం, మేజర్‌న్యూస్:** భూత భవిష్యత్తు వర్తమాన కాలజ్ఞానం రాసిన శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామిని సినీ నటి ఆమని దర్శించుకున్నారు .వీరికి శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి ముని మనవడు శ్రీ దత్తాత్రేయ స్వామి ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం జగన్మాత శ్రీ ఈశ్వరి దేవి అమ్మవారిని దర్శించుకున్నారు. అలాగే శ్రీ ఈశ్వరి దేవి మఠం మఠాధిపతి శ్రీ వీర శివ కుమారస్వామి దర్శించుకుని ఆశీర్వాదం తీసుకున్నారు. ఆమె రాకతో స్థానికులు భక్తులు సెల్ఫీలు దిగారు. ఆమె ప్రొద్దుటూరులో బట్టల షాపు ప్రారంభోత్సవానికి వచ్చి దర్శనానికి రావడం జరిగింది. శుభలగ్నం సినిమాలో ప్రస్తుతం ఇల్లు ఇల్లాలు పిల్లలు అనే సీరియల్లో నటిస్తూ ఉన్నారు. ఆమె వెంట స్థానిక అంకిరెడ్డి, రమణ ,ఈశ్వరయ్యలు ఉన్నారు.

## నేడు జగదీష్ న్యూరో కేర్ లో ఉచిత వైద్య శిబిరం

### జె.ఎన్.సి. ఎండి డాక్టర్ డి.జగదీశ్వర్ రెడ్డి



**కడప టౌన్, మేజర్‌న్యూస్:** కడప నగరంలోని జగదీష్ న్యూరో కేర్ లో ఆదివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు ఆసుపత్రి మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ డి.జగదీశ్వర్ రెడ్డి తెలిపారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రముఖ సీనియర్ జనరల్ ఫిజిషియన్ డాక్టర్ పి. క్రాంతి కుమార్ రెడ్డి శిబిరానికి విచ్చేసే వారిని ఉచితంగా పరీక్షించి తగు వైద్య సలహాలు, సూచనలు అందిస్తారని తెలిపారు. జ్వరాలు,బిపి, షుగర్, థైరాయిడ్, ఆస్తమా, కామెర్లు, గుండె జబ్బు, కిడ్నీ సమస్యలు తదితర వ్యాధులకు ఉచితంగా చూడటం జరుగుతుందన్నారు. ఈ వైద్య శిబిరంలో జనరల్ ఫిజిషియన్ డాక్టర్ కన్సల్టేషన్ ఉచితమని చెప్పారు. అలాగే షుగర్ పరీక్ష ఉచితంగా చేస్తారని తెలిపారు. డాక్టర్ సూచించిన ఇతర వైద్య పరీక్షలపై 50 శాతం తగ్గింపు ఇస్తారని తెలిపారు. అదేవిధంగా రూ 150 కే థైరాయిడ్ పరీక్షలు చేస్తారన్నారు. జూలై 1 వ తేదీ నుంచి జగదీష్ న్యూరో కేర్ లో వివిధ అనారోగ్య సమస్యలతో అడ్మిట్ అయిన సీనియర్ సిటిజన్స్‌కు, సైనికుల కుటుంబాలకు, తెల్లరేషన్ కార్డుదారులకు బెడ్ చార్జీలపై 25 శాతం తగ్గింపు ఇస్తున్నట్లు వివరించారు. తమ ఆసుపత్రిలో అందిస్తున్న వైద్య సేవలను,రాయితీలను ఉమ్మడి కడప జిల్లా ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఉచిత అపాయింట్మెంట్ కొరకు జగదీశ్ న్యూరో కేర్, సెల్ నెంబర్ 9347543717ను సంప్రదించాలని వారు కోరారు.

## నేడు 'రీ కాల్ చంద్రబాబు మేనిఫెస్టో ' పై సమావేశం

### అట్లూరు వైసిపి మండల అధ్యక్షుడు – ముడమాల ప్రభాకర్ రెడ్డి

**అట్లూరు, మేజర్‌న్యూస్:** కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ముఖ్యమంత్రి చంద్రబాబు చేస్తున్న మోసాలను అదేవిధంగా సంవత్సరం కాలంగా మేనిఫెస్టోలో చెప్పినవి ఏవి కూడా చేయకుండా ప్రభుత్వం కాలయాపన చేస్తోందని ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టి ప్రజలకు తెలియజేసేందుకు మాజీ ముఖ్యమంత్రి, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైయస్ జగన్ మోహన్ రెడ్డి పిలుపు ఇచ్చిన నేపథ్యంలో 'బాబు ష్యూరిటి మోసం గ్యారంటీ' పోస్టర్ విడుదల కార్యక్రమం బద్వేల్ లోని బయనపల్లి దగ్గర ఉన్న బొజ్జి రెడ్డి కళ్యాణ మండపం లో మధ్యాహ్నం 3:30 గంటలకు నిర్వహించడం జరుగుతుందని ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కడప వైయస్సార్ పార్టీ జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాథ్ రెడ్డి, ఎమ్మెల్సీ డిసి గోవిందరెడ్డి బద్వేల్ ఎమ్మెల్యే డాక్టర్ సుధాలు హాజరవుతారని ఈ కార్యక్రమానికి అట్లూరు మండలం లోని జడ్పిటిసిలు ఎంపీపీలు, ఎంపీటీసీలు, సర్పంచులు, వార్డు మెంబర్లు ప్రజాప్రతినిధులు, వైసిపి కార్యకర్తలు, వైసిపి అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అట్లూరు మండల వైసీపీ అధ్యక్షుడు ముడమాల ప్రభాకర్ రెడ్డి కోరారు.

# సహజీవనానికి అడ్డు వస్తున్నాడని హత్య..

### హత్య కేసులో ముద్దాయి జాఫర్ వలి అరెస్టు

### కేసు వివరాలను వెల్లడించిన జమ్మలమడుగు డిఎస్పి కె. వెంకటేశ్వరరావు

### కేసును చేదించిన ఎర్రగుంట్ల సిఐ నరేష్ బాబుతో పాటు పోలీసుల ప్రశంసలు



**ఎర్రగుంట్ల మేజర్ న్యూస్:** హసీనా అనే మహిళతో అక్రమ సంబంధం పెట్టుకుని సహజీవనం చేస్తున్న జాఫర్ వలికి హసీనా అన్న షేక్షావలి అడ్డు వస్తున్నారని ఆ అడ్డు తొలగించడానికి పథకం ప్రకారం షేక్షావలిని ఎర్రగుంట్ల పట్టణంలో మార్కెట్ యార్డు గోడెన్ వెనుక భాగంలో దారుణంగా బండరాళ్లతో కొట్టి చంపిన కేసులో జాఫర్ వలిని అరెస్ట్ చేసినట్లు జమ్మలమడుగు డిఎస్పి కె వెంకటేశ్వర్ రావు తెలియజేశారు. శనివారం ఈ హత్య కేసు కు సంబంధించి వివరాలను మీడియాకు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు కడపకు చెందిన మృతుడు షేక్షావల్లి సోదరి హసీనా భర్త 15 సంవత్సరాల క్రితం భర్త మరణించారు. పొద్దుటూరు పట్టణం గురవయ్య తోటకు లో నివాసం ఉండే షేక్ జాఫర్ వలి , హసీనా తో సహజీవనం చేస్తూ ఉండేవాడు. జాఫర్ వలి జూన్ నెల 27వ తేదీన హసీనా తన తల్లి వద్ద వదిలి 30వ తారీఖున తీసుకొని వెళ్లడానికి తన ఇంటి వద్దకు వెళ్లగా అక్కడ ఉన్న హసీనా సోదరుడు షేక్షావలి జోక్యం చేసుకొని జాఫర్ వలిని తిట్టి మందలించి , ఇక మీదట నుంచి తన చెల్లెలు హసీనా కోసం ఇంటి దగ్గరకు రావద్దని తీవ్రంగా మందలించాడు. తన సహజీవనం కు హసీనా అన్న షేక్షావల్లి అడ్డు వస్తున్నాడని అతనిని ఏదో రకంగా చంపి అడ్డు తొలగించుకుంటేనే తనకు హసీనా దక్కుతుందని భావించి ఎలాగైనా షేక్షావల్లిని చంపాలని జాఫర్ వలి నిర్ణయించుకున్నాడు. ఈ నెల 1వ తేదీన ముద్దాయి జాఫర్ వలి, షేక్షావలి ఉండే వీధిలో తిరుగుతుండగా షేక్షావలి ఎదురుపడ్డాడు. ఇద్దరం కలిసి మద్యం సేవిస్తామని తనతో రమ్మని జాఫర్ వలి అడగగా దానికి షేక్షావలి ఒప్పుకున్నాడు. తర్వాత వారిద్దరు కడప పట్టణంలో మద్యం సేవించి ఎర్రగుంట్లకు వెళ్లి కుక్కలు పడదామని చెప్పి ఒక్కొక్క కుక్కకి రూ. 300 డబ్బు ఇప్పిస్తానని చెప్పి ఎర్రగుంట్లకు తీసుకుని వచ్చాడు. అదే రోజు ఇద్దరు కలిసి కడప రైల్వే స్టేషన్లో రైలు ఎక్కి, ఎర్రగుంట్ల రైల్వే స్టేషన్ లో దిగారు. సాయంత్రం నాలుగు గంటలకు నాలుగు రోడ్ల కూడలిలో రెండు క్వార్టర్ల మద్యం బాటిళ్లు, రెండు ప్లాస్టిక్ గ్లాసులు తీసుకొని వ్యవసాయ మార్కెట్ యార్డు ఆవరణంలో ఉన్న గొడౌన్ వెనుక భాగంలో ఖాళీ స్థలానికి వెళ్లారు. అక్కడే ఇద్దరు మద్యం సేవించారు. జాఫర్ వలి తక్కువ మద్యం సేవించి, షేక్షావల్లి కి మద్యం ఎక్కువ త్రాగించాడు. షేక్షావలి మద్యం మత్తులో అక్కడే కింద పడిపోయాడు. ఇదే అదునుగా భావించి జాఫర్ వల్లి అక్కడే ఉన్న బండరాళ్లతో ఇటుకలతో తల మీద కొట్టి హత్య చేశాడు. జాఫర్ వలి అక్కడ నుంచి వెళ్లిపోయి పొద్దుటూరులో తలదాచుకున్నాడు. మృతుడు షేక్షావలి తమ్ముడు సయ్యద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎర్రగుంట్ల సిఐ నరేష్ బాబు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. ఈ దర్యాప్తులో జాఫర్ వలి ముద్దాయిగా నిర్ధారించి కమలాపురం కోర్టుకు హాజరు పరిచినట్లు డిఎస్పి తెలియజేశారు.

**ఎర్రగుంట్ల సిఐ నరేష్ బాబుకు పోలీసులకు రివార్డులు**

ఎర్రగుంట్ల లో జరిగిన హత్య కేసు సంబంధించి విచారణ ముమ్మరం చేసి అతి తక్కువ సమయంలోనే ముద్దాయి జాఫర్ వలి అరెస్ట్ చేసి నందు గాను, ఎర్రగుంట్ల సిఐ నరేష్ బాబుకు జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ప్రత్యేకంగా అభినందించి, రివార్డు కూడా ప్రతిపాదన చేశామన్నారు. అంతే కాకుండా ఈ కేసు చేదించడానికి తోడ్పాటు అందించిన కానిస్టేబుల్ కు కూడా రివార్డులు ఇవ్వడానికి ప్రతిపాదన చేసినట్లు డిఎస్పి వెంకటేశ్వరరావు ఈ సందర్భంగా తెలియజేశారు.

# మున్సిపల్ ఇంజనీరింగ్ ఒప్పంద కార్మికులకు వేతనాలు పెంచాలి ..!


### ఏఐటీయూసీ బద్వేల్ పట్టణ ప్రధాన కార్యదర్శి ఇర్ల నాగేష్



**బద్వేల్, మేజర్‌న్యూస్ :** మున్సిపల్ కార్యాల యంలో విధులు నిర్వహిస్తున్న ఇంజనీరింగ్ ఒప్పంద కార్మికులకు వేతనాలు పెంచాలి అని ఏఐటీయూసీ బద్వేల్ పట్టణ ప్రధాన కార్యదర్శి ఇర్ల నాగేష్ తెలిపారు.రాష్ట్ర సమితి ఇచ్చిన పిలుపులో భాగంగా ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ బద్వేల్ పట్టణ సమితి ఆధ్వర్యంలో శనివారం మున్సిపల్ కమిషనర్ ఛాంబర్ నందుమున్సిపల్ కమిషనర్ వివి నరసింహారెడ్డి వినతి పత్రం అందజేశారు.ఈ సందర్భంగా ఏఐటియుసి బద్వేల్ పట్టణ ప్రధాన కార్యదర్శి ఇర్ల నాగేష్ మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మున్సిపాలిటీలో పనిచేస్తున్న కార్మికులకు ఎలాంటి మేలు చేయలేదని వరు అన్నారు మున్సిపాలిటీలో అన్ని రంగాల్లో పనిచేస్తున్న కార్మికులకు సంక్షేమ పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు అలాగే జీవో ఎంఎస్ నెంబర్ 36 ప్రకారం వేతనాలు పెంచి ఇవ్వాలని కోర్టు నిర్ణయాల మేరకు కనీస వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు, ఈ కార్యక్రమంలో ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ నాయకులు శ్రీనివాసరాజు నరసింహులు నరసయ్య ఆదినారాయణ దేవా వై వెంకటరమణ హరి శ్రీనివాసులు తదితర కార్మికులు పాల్గొన్నారు,

# కమ్మవారి పల్లెలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం

### సంక్షేమం- అభివృద్ధి రెండు కళ్ళు - టిడిపి సమన్వయకర్త రితేష్ రెడ్డి



**పోరుమామిళ్ల, మేజర్‌న్యూస్ :** పోరుమామిళ్ల మండలం రంగసముద్రం గ్రామపంచాయతీ పరిధిలోని కమ్మవారిపల్లెలో శనివారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బద్వేల్ నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ సమన్వయకర్త రితేష్ రెడ్డి పాల్గొన్నారు. ఆయన ఇంటింటికి తిరిగి ప్రభుత్వం అందిస్తున్న పథకాలను అడిగి తెలుసుకుని వివరించడం జరిగింది. అలాగే ఏవైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకువస్తే వాటిని త్వరితగతిన పరిష్కరించే విధంగా కృషి చేస్తానన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడి దాదాపు సంవత్సరం కాలం అవుతుందని తెలిపారు. ఈ ప్రభుత్వానికి సంక్షేమం- అభివృద్ధి అనేది రెండు కళ్ళలాంటివి అన్నారు. ఈ ప్రభుత్వంలో ఎన్టీఆర్ భరోసా కింద పెన్షన్లను ప్రతినెల ఒకటో తేదీన ఇంటి వద్దనే అందిస్తున్నామన్నారు. ఇంటిలో ఎంతమంది పిల్లలు చదువుకుంటూ ఉంటే అంతమందికి తల్లికి వందనం ఇవ్వడం జరుగుతుందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ఏటా మూడు సిలిండర్లు ఉచితంగా అందిస్తున్నామన్నారు. అన్న క్యాంటీన్ల ద్వారా 5 రూపాయలకే నాణ్యమైన భోజనాన్ని అందిస్తున్నామన్నారు. యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నామన్నారు. రైతులకు అన్నదాత సుఖీభవ పథకం ప్రారంభించామన్నారు. త్వరలో మహిళల కొరకు ఉచిత బస్సు ప్రారంభించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో బద్వేల్ నియోజకవర్గ కూటమి అభ్యర్థి బొజ్జ రోషన్న, బద్వేల్ మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ చెన్నరాయుడు, పోరుమామిళ్ల మేజర్ పంచాయతీ సర్పంచ్ యనమల సుధాకర్, టిడిపి మండల అధ్యక్షుడు భైరవ ప్రసాద్, మాజీ అధ్యక్షుడు కొండ కృష్ణారెడ్డి, ఎంపీటీసీ కల్వకూరి రమణ, సుబ్బారావు, సెట్టెం ప్రతాప్, కరీముల్లా, అన్వర్ మరియు తెలుగుదేశం పార్టీ మండల స్థాయి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# మా పై దాడి చేసిన వారిపై కేసు నమోదు చేయాలి

### వికలాంగురాలు నాగిపోగు లక్ష్మీదేవి



**బ్రహ్మంగారిమఠం, మేజర్‌న్యూస్ :** బ్రహ్మంగారిమఠం మండలం మల్లేపల్లి గ్రామం మాదిగవాడ నివాసి అయినా హరి ఓబయ్య భార్య నాగిపోగు లక్ష్మీదేవి ప్రమాదవశాత్తు కన్ను దెబ్బతిని వికలాంగురాలిగా మారడం జరిగింది. తమకు తన తండ్రి మూడు సెంట్లు ఇవ్వడం జరిగింది ఆ స్థలాన్ని నాగిపోగు చిన్నయ్య మరియమ్మలు దౌర్జన్యం చేసి ఆ స్థలాన్ని దౌర్జన్యం చేసి తీసుకోవాలని నాపై గలాటకు వచ్చన వారి పై చర్యలు తీసుకొని కేస్ నమోదు చేయాలని లక్ష్మి దేవి కోరారు. శనివారం ఈ సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడుతూ నాకు రెండవ కన్ను కూడా సరిగా కనిపించనందున ఏ పనీ చేయలేక ప్రభుత్వ పించన్ పైఆధారపడి ఉన్నాను. నా భర్త కూలీ పనులు చేసి కుటుంబాన్ని పోషిస్తాడు.మాకు ఇద్దరు కుమార్తెలు మా గ్రామం అయిన మల్లేపల్లె నందు నా తండ్రి కి సంబంధించిన 3 సెంట్లు స్థలం నా వివాహం సమయంలో ఆ స్థలాన్ని ఇవ్వగా అక్కడే కొట్టిగా గుడిసె ఏర్పాటు చేసుకొని జీవనం సాగించేవారము. మాకు అప్పటి టీడీపీ ప్రభుత్వం నాకు పక్కా గృహం మంజూరు చేయగా నేను 3 సెంట్లలో 1. 1/2 సెంట్లు పక్కా గృహం నిర్మించుకున్నాను. మిగిలిన 1.1/2 సెంట్ల స్థలంఖాళీగా ఉంచుకున్నాను. 4వ తేది నాగిపోగు మరియమ్మ ఆమె బంధువులు నా స్థలం లోనికి వచ్చి నేను కట్టేసిన బర్రెలను విప్పేసారు. దౌర్జన్యంగా నాకు సంబంధించిన ఎరువు దిబ్బకు నిప్పు పెట్టి బర్రెలను తరిమి కొట్టినారు. నేను, నా భర్త కలిసి ఇది అన్యాయం మా పై దౌర్జన్యం ఎందుకు చేస్తున్నారు.నా స్థలం వారిది ఎందుకు అవుతుంది అని నేను ప్రశ్నించగా వారు నాపై దుర్భాషలాడి కొట్టడానికి వచ్చిన వారిపై అధికారులు చర్యలు తీసుకొని కేసు నమోదు చేసి నాకు న్యాయం చేయాలని కోరారు.

# అధ్వాన స్థితిలో వేంపల్లె ప్రధాన రోడ్లు


### ఏపిసిసి ముఖ్య అధికార ప్రతినిధి డా.ఎన్ తులసిరెడ్డి

**వేంపల్లె, మేజర్‌న్యూస్:** పేరుగొప్ప-ఊరుదిబ్బ, ఇంటిపేరు కస్తూరివారు-ఇంట్లో గబ్బిలాల మోత అన్నట్లు వేంపల్లె ప్రధాన రోడ్ల దుస్థితి, పంచాయతీ పరిస్థితి అని ఏపిసిసి ముఖ్య అధికార ప్రతినిధి డా.ఎన్ తులసిరెడ్డి ధ్వజమెత్తారు. శనివారం పట్టణంలో అర్ధాంతరంగా ఆగిపోయిన రోడ్ల విస్తరణ, డ్రైనేజీ పనులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పులివెందుల నియోజకవర్గం నుంచి మాజీ సిఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి శాసన సభ్యునిగా ప్రాతినిధ్యం వహిస్తున్నప్పటికీ సమస్యల సుడిగుండంలో కొట్టుమిట్టాడుతుందన్నారు. జగన్ పట్టించుకోక, ప్రభుత్వం పట్టించుకోక నియోజకవర్గ ప్రజల పాలిట శాపమైందన్నారు. మండల కేంద్రమైన వేంపల్లెలో 50 వేల జనాభా ఉంటుందన్నారు. చుట్టు 5 మండలాలకు కూడలి, నిత్యం రద్దీగా ఉంటుందన్నారు. దీన్ని దృష్టిలో పెట్టుకుని గత ప్రభుత్వం పనులు మంజూరు చేసిందన్నారు. కానీ ఇప్పటికీ ఆ పనులు 27 శాతం మేరనే పూర్తి అయినట్లు తెలిపారు. దీంతో పాటు అండర్ డ్రైనేజీ పనులు కూడా 17 శాతం మాత్రమే జరిగాయన్నారు. ఉన్న రోడ్లు, మురుగు నీటి కాల్వలు త్రవ్వడం వల్ల దుమ్ము, ధూళితో, మురుగు నీరు నిల్వతో ప్రజలు నానా అవస్థలు పడుతున్నట్లు ఆవేదన వెలిబుచ్చారు. ఆగిపోయిన పనులు పునః ప్రారంభించాలని తులసిరెడ్డి విజ్ఞప్తి చేశారు.



# నకిలీ కానిస్టేబుల్ పై ఫిర్యాదు





**పోరుమామిళ్ల మేజర్ న్యూస్.** కడప జిల్లా, పోరుమామిళ్ల మండలం, కమ్మవారిపల్లి గ్రామములో నివాసము ఉండే ఒక యువతిని 27.10.2024 వ తేదిన సత్యసాయి జిల్లా, తనకల్లు మండలం, తుమ్మలవారిపల్లి గ్రామానికి చెందిన సవరాల భాను ప్రకాష్ హైదరాబాద్ లో ఏఆర్ కానిస్టేబుల్ గా పని చేస్తున్నానని చెప్పి, నమ్మించి మోసం చేసి వివాహం చేసుకున్నాడని మరియు అదనపు కట్నం కోసం వేదిస్తున్నారని, వివాహ సమయంలో ఇచ్చిన కట్నం లో కొంత బంగారాన్ని బ్యాంక్ లో తాకట్టు పెట్టి ఖర్చు చేసి, మిగిలిన బంగారు కోసం అమ్మాయిని వేధింపులు చేయడంతో యువతి సదరు భాను ప్రకాష్ మరియు అతని తండ్రి సవరాల కృష్ణప్ప పై పోరుమామిళ్ల పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేయడం జరిగింది. ఈ విషయంపై పోలీసులు విచారణ చేపట్టారు.

# ప్రొద్దుటూరు ప్రముఖ వైద్యులకు సన్మానం




**ప్రొద్దుటూరు, మేజర్ న్యూస్:** డాక్టర్ బిసిరాయ్ జన్మదినోత్సవం పురస్కరించు కొని స్థానిక బుడ్డాయపల్లె లోని ఐ.ఎం.ఏ భవన్ నందు జాతీయ వైద్యుల దినోత్సవం నిర్వహించారు. ఇందులో భాగంగా సీనియర్ వైద్యులు డాక్టర్ ఎం.బుసిరెడ్డిని ఘనంగా సన్మానించారు. అదేవిధంగా ఎన్టీఆర్ వైద్య విశ్వవిద్యాలయ పాలకమండలి సభ్యులుగా నియమింపబడిన డాక్టర్ వరుణ్ కుమార్ రెడ్డిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఐ.ఎం.ఏ ప్రెసిడెంట్ డాక్టర్ త్యాగ రాజ రెడ్డి, సెక్రటరీ డాక్టర్ సాయి ప్రసాద్ మరియు ఇతర వైద్య ప్రముఖులు పాల్గొన్నారు.

# అన్నదానం మహా పుణ్య కార్యం

## ఎస్.ఎన్.సి.ట్రస్ట్ చైర్మన్ సాయి కిరణ్



**కడప టౌన్, మేజర్‌న్యూస్:** ఆకలితో ఉన్నవారికి ఆకలి తీరిస్తే అది ఎంతో పుణ్యకార్యమని శ్రీ నారాయణ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ సాయికిరణ్ రాజు అన్నారు. శనివారం రిమ్స్ ప్రాంగణంలో ట్రస్ట్ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రమం తప్పకుండా ప్రతి శనివారం రిమ్స్ ప్రాంగణంలో రోగులకు వారి సహాయకులకు అన్నదానం నిర్వహిస్తున్నమని తెలిపారు. ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించే సేవా కార్యక్రమాలకు దాతలు మరింతగా సహకరించాలని విజ్ఞప్తి చేశారు. మానవసేవయే మాధవ సేవగా భావించి సామాజిక సేవా కార్యక్రమాలను ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నామని చెప్పారు. తమకు సహకరిస్తున్న ప్రతి ఒక్కరికి ఆయన ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీ నారాయణ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు భార్గవ్, నరసింహా, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు

# డ్రైనేజీ వ్యవస్థల వల్ల మున్సిపాలిటీ ప్రజలు ఇబ్బందులకు గురి కాకూడదు..!

## మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి..



**బద్వేల్, మేజర్‌న్యూస్ :** మున్సిపాలిటీ పరిధిలోని ప్రజలు డ్రైనేజీ వ్యవస్థ వల్ల ప్రజలుఇబ్బందులకు గురి కాకూడదని మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలోని వార్డుల విజిట్ కార్యక్రమంలో భాగంగా శనివారం మునిసిపల్ కమీషనర్ నరసింహారెడ్డి అశోక్ నగర్ లో ఫీల్డ్ విజిట్ చేయడం జరిగింది అశోక్ నగర్ వార్డు లో నివసించే ప్రజలు డ్రైనేజీ నీరుసక్రమంగా వెళ్లకపోవడం వల్ల మురుగునీరంత గృహాల మధ్యనే మురు గు నీరు నిల్వ ఉండడం వల్ల ప్రజలు తీవ్ర అనారోగ్యాలకు గురి అవుతున్నామని ప్రజలు తెలపడంతో వెంటనే కమిషనర్ శానిటేషన్ సిబ్బందిని పిలిపించి డ్రైనేజీ మురుగునీరు ఎందుకు నిలువ అవుతుందో తెలుసుకోవాలని సూచించారు ఈ సందర్భంగా సిబ్బంది వార్డులో పరిశీలించగా సందు రస్థారోడ్డునుఆక్రమించడం వల్ల బ్లాక్ అయి మురికి నీరు వెళ్లడం లేదని కమీషనర్ కు తెలపగా స్పందించిన కమిషనర్ రస్తారోడ్డును ఆక్రమణలు తొలగించాలని ఆయన ఆదేశించడంతో వెంటనే మున్సిపల్ సిబ్బంది జేసీబితో వాహనముతోఆక్రమణలు తొలగించి మురికి నీరు వెళ్లేందుకు చర్యలు చేపట్టారు. మురికి నీరు వెళ్లేందుకు మునిసిపల్ సిబ్బంది కమిషనర్ ఆదేశాల మేరకు సంజూరస్తాలోని ఆక్రమణలు తొలగించి డ్రైనేజీ ద్వారా మురికి నీరు వెళ్లి వెళ్లేందుకు చర్యలు చేపట్టిన మున్సిపల్ కమిషనర్ కి సిబ్బందికి వార్డు ప్రజలు ధన్యవాదాలు తెలిపారు.

# చంద్రబాబు మోసపూరిత మెనీ పెస్టోను ఇంటింటికి తెలియజేయండి

## మాజీ ఎమ్మెల్యే ఎస్. రఘురామిరెడ్డి

**మైదుకూరు మేజర్ న్యూస్ :** చంద్రబాబు ఎన్నికల సమయంలో మోసపూరిత మేనిఫెస్టోను గుర్తుచేస్తూ ప్రతి ఇంటింటికి వెళ్లి ప్రజలందరికీ తెలియజేయాలని మైదుకూరు మాజీ ఎమ్మెల్యే, క్రమశిక్షణ కమిటీ చైర్మన్ శెట్టిపల్లి రఘురామిరెడ్డి కార్యకర్తలకు పిలుపునిచ్చారు. మైదుకూరు వైస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శనివారం రఘురామిరెడ్డి అధ్యక్షతన జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాధ్ రెడ్డి ఆధ్వర్యంలో బాబు సూరిటీ -మోసం గ్యారంటీ క్యూ ఆర్ కోడ్ ని ఆవిష్కరించారు. వైయస్సార్ పార్టీ జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాథ్ రెడ్డి మాట్లాడుతూ బాబు సూరిటి మోసం - గ్యారంటీ క్యూ ఆర్ కోడ్ ను ప్రతి ఒక్కరూ స్కాన్ చేసే విధంగా పార్టీ కార్యకర్తలు ప్రతి ఇంటికి వెళ్లి క్యూఆర్ కోడ్‌పైనఅవగాహన కలిగించవలసినదిగా కోరారు. 2027లో వచ్చేది వైయస్సార్ కాంగ్రెస్ పార్టీయేనని ఇప్పుడు జరుగు తున్న అక్రమాలను అన్యాయాలను బుక్‌లో రాసి పెట్టుకోవాలని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ వచ్చిన తర్వాత మనకు అన్యాయం చేసిన వారిని వదిలే ప్రసక్తి లేదని రవీంద్రనాథ్ రెడ్డి అన్నారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే రఘురామిరెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మేనిఫెస్టో పేరుతో ప్రజలందరినీ మోసం చేశాడని, హామీలను నెర వేర్చక సంపద సృష్టిస్తున్నామంటూ లక్షల కోట్లు అప్పులు చేస్తున్నారంటూ మండిపడ్డారు. 2027లో జంబ్లీ ఎన్నికలు రావడం గ్యారంటీ అని ఆ ఎన్నికలలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ భారీ మెజార్టీతో గెలవడం కోసం ప్రతి కార్యకర్త కష్టపడాలని ఉన్నారు. కూటమి ప్రభుత్వంలో బిజెపి జనసేన టిడిపిలో కలిసి పనిచేసేయని, సుపరిపాలన



పేరుతో చంద్రబాబు నాయుడు - లోకేష్ ఫోటో వేసుకొని పవన్ కళ్యాణ్‌మోసం చేశారని అన్నారు. చెప్పినవి చేశామా లేదా అనేవి ప్రజలకు కావాలని అమ్మ వడి, ఆశ్ర, విద్యాదీవేన,రైతుభరోసా, వసతి దేవేనా వంటి పథకాలు ఇచ్చారని గుర్తు చేశారు. ఆగస్టులో చంద్రబాబు ప్రారంభిస్తున్న ఇండ్లు జగన్ కట్టించినవేనని, ఆడ బిడ్డ నిధి ఎగ కొట్టిన ఘనత చంద్రబాబు లేదని అన్నారు. కార్యక్రమంలో వర్క్ బర్డ్ జిల్లా అధ్యక్షుడు మదీనా దస్తగిరి, కాజీపేట రాఘవరెడ్డి, మాజీ ఆర్టీసీ చైర్మన్ రెడ్డి వెంకట్ సుబ్బారెడ్డి, మహబూబ్ షరీఫ్, మూలే భరత్ రెడ్డి, కొత్తపల్లి సర్పంచ్ నాగిరెడ్డి, అట్లూరు వెంకటసుబ్బారెడ్డి, మండల వైస్ ప్రెసిడెంట్ రఘురామిరెడ్డి, కిరణ్మయి, ఎంపీటీసీలు, జడ్పీటీసీలు,సర్పంచులు వైఎస్సార్సీపీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# అసాంఘిక కార్యకలాపాలకు చెక్ పెట్టేందుకే పల్లెనిద్ర

## జమ్మలమడుగు డీఎస్పీ కె వెంకటేశ్వరరావు

## జమ్మలమడుగు డివిజన్ పరిధిలో అన్ని గ్రామాలలో ప్రతిరోజు కానిస్టేబుల్స్ పల్లెనిద్ర

**ఎర్రగుంట్ల మేజర్ న్యూస్:** గ్రామాలలో నెలకొన్న సమస్యలను తెలుసుకోవడానికి అక్కడ అసాంఘిక కార్యకలాపాలను చెక్ పెట్టేందుకు కానిస్టేబుల్స్ పల్లెనిద్ర కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారని జమ్మలమడుగు డిఎస్పి కె వెంకటేశ్వరరావు తెలియజేశారు. శనివారం ఆయన ఎర్రగుంట్ల పోలీస్ స్టేషన్లో మీడియాతో పల్లె నిద్రపైన మాట్లాడారు. జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ఆదేశాల మేరకు జమ్మల మడుగు డివిజన్ పరిధిలో ప్రతి గ్రామంలో పల్లెనిద్ర కార్యక్రమాన్ని కానిస్టేబుల్స్ నిర్వహిస్తున్నారని తెలియజేశారు. ఆ గ్రామంలో జరిగే సమస్యలను తెలుసుకొని సంబంధిత రెవెన్యూ అధికారుల ద్వారా సమస్యల పరిష్కరించడానికి కృషి చేస్తామన్నారు. గ్రామంలో అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా ఉండేందుకు పల్లెనిద్ర కార్య క్రమం ఎంతగానో ఉపయోగపడుతుం దన్నారు. దొంగతనాలు జరగకుండా ఉండేందుకు సీసీ కెమెరాలు ఏర్పాటుపై, శక్తి యాప్ ఉపయోగంపై అవగాహన కార్యక్రమాన్ని ఆయా గ్రామ ప్రజలకు మా కానిస్టేబుల్స్ అందజేస్తారన్నారు. అందుకే ప్రజలందరూ పల్లెనిద్ర కార్యక్రమంలో



పాల్గొన్న కానిస్టేబుల్ కు సహకరించి గ్రామంలో ఉన్న సమస్యలను తెలియజేయాలని స్నేహపూరిత పోలీసు వ్యవస్థను అభివృద్ధి చేయాలని దృఢ సంకల్పంతోనే ఈ కార్యక్రమానికి జిల్లా ఎస్పీ గారు శ్రీకారం చుట్టారని ఆయన ఈ సందర్భంగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎర్రగుంట్ల సీఐ నరేష్ బాబుతో పాటు ఇతరులు పాల్గొన్నారు.

# విద్యాశాఖలో వింత నిర్ణయాలు మానుకోవాలి

## మెగా పిటిఎంలో విట్ నెస్ అధికారి నియామకం సరికాదు

## -ఎస్టీయు రాష్ట్ర అదనపు ప్రధానకార్యదర్శి పి.రమణారెడ్డి



**కలసపాడు మేజర్ న్యూస్** విద్యాశాఖలో అమలు చేస్తున్న పలు వింత నిర్ణయాలు మానుకోవాలని ఎస్టీయు రాష్ట్ర అదనపుప్రధానకార్యదర్శి పి.రమణారెడ్డి హితవు పలికారు. శనివారం కలసపాడులో రమణారెడ్డి మాట్లాడుతూ ఉపాధ్యాయులతో బోధన తప్ప ఎటువంటి కార్యక్రమాలు చేయించబోమని చెప్పి,మెగా పిటిఎం శిక్షణల పేరుతో బోధనాకార్యక్రమాలకు ఆటంకం కలిగించడం ఎంతవరకు సబబో ఆలోచించాలన్నారు.మెగా పిటిఎం కార్య క్రమంలో విద్యాశాఖకు సంబంధంలేని ఒకరిని విట్ నెస్ అధికారిగా నియమించు కోమనడం విడ్డూరంగా ఉందన్నారు. అంటే ఉపాధ్యాయులపై నమ్మకం లేక ఇలా సాక్షులుగా వేరే డిపార్ట్ మెంట్ వారిని నియిమించడం సరియైన పద్ధతి కాదన్నారు. అదేవిధంగా కమిటీల పేరుతో,ఆహ్వానాల పేరుతో,డాక్యుమెంటేషన్ పేరుతో ఉపాధ్యా యు లను బోధనకు దూరం చేయడం కాదా అని ప్రశ్నించారు. చివరకు పాఠశాలలలోని విద్యార్థులకు, ఉపాధ్యాయు లకు ఇవ్వవలసిన ఐచ్ఛికశెలవుల విషయంలో కూడా గందరగోళాన్ని సృష్టించడం ఏమిటో అర్థం కావడం లేదన్నారు.పిల్లలకు లేకుండా కేవలం టీచర్లు మాత్రమే ఐచ్ఛికశెలవులు వాడుకో మనడం విచిత్రంగా ఉందన్నారు. అంటే పిల్లలు పండుగలు చేసుకోకూడదా! అని ఆశ్చర్యం వ్యక్తం చేశారు. అంతేకాక ప్రధానంగా డిఎలు, మధ్యంతరభృతి,పీఆర్సీల విషయంలో ఉద్దేశ్యపూర్వకంగానే తీవ్ర జాప్యం చేయడం నిరంకుశత్వానికి నిదర్శనమన్నారు. వెంటనే పన్నెండవ పీఆర్సీ ప్రకటించి,30శాతం మధ్యంతరభృతి ప్రకటించా లాన్నారు.ఉద్యోగ ఉపాధ్యాయుల విషయంలో ఇదే వైఖరిని కొనసాగిస్తే ఊహించని ఉద్యమాలు చేపట్టక తప్పదన్నారు

# నూతన గ్రామ మండల కమిటీ నిర్మాణం



**కలసపాడు మేజర్ న్యూస్** జులై 7న 31వఎంఆర్పిఎస్ ఆవిర్భావ దినోత్సవం గుండాల ఈశ్వరయ్య మాదిగ మహాజన సోషలిస్టు పార్టీ జాతీయ నాయకులు, ఎంఆర్పిఎస్ జిల్లా ఇంచార్జ్ ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా గుండాల ఈశ్వరయ్య మాదిగ మాట్లాడుతూ పద్మశ్రీ మందకృష్ణ మాదిగ 30 సంవత్సరాల ఉద్యమ పోరాటంలో ఎస్సీ షెడ్యూల్ కులాల వర్గీకరణ కోసం అలుపెరగని పోరాటం చేసి నేడు అత్యున్నతమైన న్యాయస్థానమైన సుప్రీంకోర్టు నందు ఎస్సి షెడ్యూల్ కులాల వర్గీకరణను సాధించి పెట్టిన మహా పోరాట యోధుడు పద్మశ్రీ మందకృష్ణ మాదిగ సమాజం మనకోసం ఎస్సీ షెడ్యూల్డ్ వర్గీకరణ సాధించుకోవడం కోసం ఎంతో అండదండలు చూపించిన సంగతి మన అందరికి తెలుసు అయితే ఇప్పుడు సమాజానికి మనం సేవ చేయాలని పద్మశ్రీ మందకృష్ణ మాదిగ ఆదేశించడం జరిగింది. ఈ సందర్భంగా గ్రామ గ్రామాన నూతన గ్రామ నూతన కమిటీ అదే విధంగా మండల కమిటీ ఎన్నుకొని అదే సమయంలో జూలై 7న 31వ ఎం ఆర్ పి ఎస్ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా ఒక పండుగ వాతావరణంలో జరుపుకోవాలని ఆదేశాలు ఇవ్వడం జరిగింది. శనివారం కలసపాడు మండలంలో ఎన్నుకోబడిన మండల కమిటీ పద్మశ్రీ మందకృష్ణ మాదిగ అడుగుజాడలో ఏ పిలుపు ఇచ్చిన తూ.చా.తప్పకుండా పాటించాలని గుండాల ఈశ్వరయ్య మాదిగ గుర్తు చేయడం జరిగింది. మాతయ్య మాదిగ ఎంఎస్పి అధికార ప్రతినిధి మరియు కలసపాడు ఎం ఆర్ పి ఎస్ మండల ఇన్చార్జిగా నియమించబడినప్పటి నుండి గ్రామ కమిటీలు నిర్మాణం చేసి శనివారం కలసపాడులోని చర్చి మండలం హెడ్ కోటర్స్‌లో గుండాల. ఈశ్వరయ్య మాదిగ అధ్యక్షతన మరియు మండల ఇంచార్జి %ఎ% మాతయ్య ఆధ్వర్యంలో అన్ని గ్రామాల మాదిగ సమక్షంలో మండల కమిటీని ఎన్నుకోవడం జరిగింది.

**కలసపాడు మండలం ఎంఆర్పిఎస్ నూతన నిర్మాణ కమిటీ**

మండల అధ్యక్షులు: ఓ తిమోది మాదిగ, ఉపాధ్యక్షులు: కే కిరణ్ మాదిగ, ప్రధాన కార్యదర్శి: ఎస్ చంద్ర మాదిగ, కోశాధికారి: ఎస్ ప్రసన్నకుమార్ మాదిగ, సహాయక కార్యదర్శి: కే బద్రీ మాదిగ, ప్రచార కార్యదర్శి: కె పుల్లయ్య మాదిగ, సహాయక కార్యదర్శులు: 1. ఎస్ రాజేంద్ర బాబు మాదిగ, 2. ఓ.విజయ్ మాదిగ, 3. కే గురువయ్య మాదిగ, **కార్యవర్గ సభ్యులు:** ఓ చంద్ర మాదిగ, 2. పి వరదరాజు మాదిగ ఎన్నుకోవడం జరిగిందని వారు తెలిపారు

# నాయకులను కార్యకర్తలను భయభ్రాంతులకు గురిచేయడమే కూటమి లక్ష్యం

## వైఎస్ఆర్సిపి జిల్లా ఉపాధ్యక్షులు డి.వి.శశికాంత్ రెడ్డి

**పులివెందుల మేజర్ న్యూస్** కూటమి ప్రభుత్వంలో కూటమి నాయకులు వైకాపా నాయకులను కార్యకర్తలను బెదిరించే విధంగా, భయభ్రాంతులకు గురి చేస్తున్నారని, తోరణాలు తొలగిస్తే 307 కేసులు పెట్టడం ఏమిటని వైఎస్ఆర్సిపి జిల్లా ఉపాధ్యక్షుడు డివి శశి కాంత్ రెడ్డి అన్నారు. శనివారం విలేకరులతో మాట్లాడుతూ ఇటీవల జరిగిన మహానాడు కార్యక్రమానికి సంబంధించి కూటమి నాయకులు పులివెందుల రింగ్ రోడ్ లో ఉన్న వైయస్సార్ బొమ్మలకు దండాలు తోరణాలు తలచిన వివాదంలో వైకాపా నాయకులపై అక్రమ కేసులు పెట్టడం జరిగిందన్నారు. ఈ కేసులో వైకాపా నాయకులపై పోలీసులు థర్డ్ డిగ్రీ ఉపయోగించడం జరిగిందన్నారు. ఈ విషయంలో పులివెందుల పోలీసులకు హైకోర్టులో చుక్క ఎదురయింది చుక్కెదురైందన్నారు. కాలం ఎల్లకాలం ఒకేలా ఉండదన్నారు. పార్టీలు వస్తూ ఉంటాయి పోతూ ఉంటాయి. అధికారులు మాత్రం అందరికీ న్యాయం చేసే విధంగా వ్యవహరించాలన్నారు. ఎవరో కొంతమంది వ్యక్తులు చెప్తే 307 కేసు పెట్టడం దారుణం అన్నారు. ఇంకా



రాష్ట్రంలో రెడ్ బుక్కు రాజ్యాంగం జరుగుతుందన్నారు. రాష్ట్ర ప్రజలు అన్ని గమనిస్తూనే ఉన్నారన్నారు. ప్రజలకు మంచి చేయాలి తప్ప ప్రభుత్వాలు కక్ష సాధింపు చర్యలు చేయడం ఏంటని ఆయన ప్రశ్నించారు.

# స్మార్ట్ విద్యుత్ మీటర్ల బిగింపు నిర్ణయాన్ని వెనక్కు తీసుకోవాలి





**మైదుకూరు మేజర్ న్యూస్ :** స్మార్ట్ విద్యుత్ మీటర్ల బిగింపు నిర్ణయాన్ని వెనక్కు తీసుకోవాలని శనివారం సిపిఐ ఆధ్వర్యంలో మైదుకూరు విద్యుత్తు ఏడిఈ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐ మైదుకూరు నియోజక వర్గం కార్యదర్శి పి.శ్రీరాములు, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం( ఏఐకేఎస్) వైయస్సార్ కడప జిల్లా ప్రధాన కార్యదర్శి పోతిరెడ్డి భాస్కర్ లు మాట్లాడుతూ సర్దుబాటు చార్జీలు, సర్ చార్జీల రూపంలో విద్యుత్ బిల్లులను ఇబ్బడి ముబ్బడిగా పెంచి పేద, మధ్యతరగతి ప్రజలపై మోయలేని భారాలను ఈ రాష్ట్ర ప్రభుత్వం మోపిందని, సర్దుబాటు, సర్ చార్జీలను వెంటనే తగ్గించాలని, స్మార్ట్ మీటర్ల బిగింపు నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని కోరారు.అనంతరం విద్యుత్ ఏడిఈ కార్యాలయ ఆపరేటర్ వి. మల్లేశ్వరుడుకి వినతి పత్రాన్ని అందజేశారు.అనంతరం విద్యుత్ ఏడి ఈ కార్యాలయ ఆపరేటర్ వి. మల్లేశ్వరుడుకి వినతి పత్రాన్ని అందజేయడం జరిగింది. ఈ ధర్నా కార్యక్రమంలో సిపిఐ మైదుకూరు పట్టణ కార్యదర్శి డి. సుబ్బరాయుడు, సహాయ కార్యదర్శి కె. జయరాజు, ఏఐటియు సి నాయకులు బి. పీరయ్య, సిపిఐ నాయకులు పి. శంకర్, ఎస్సీ, ఎస్టి ఫోరం మైదుకూరు నియోజకవర్గం అధ్యక్ష, కార్యదర్శులు విలియం, కనకరాజు, హ్యూమన్ రైట్స్ నాయకులు ఏ. కె. వల్లి, సిపిఐ, ప్రజా సంఘాల కార్యకర్తలు సుంకన్న, వి. పుల్లయ్య, సి. నరసింహులు, సుంకయ్య ఈ ధర్నా కార్యక్రమంలో పాల్గొనడం జరిగింది.

# శ్రీ భారతి స్కూలు గుర్తింపు రద్దు చేయాలి

## ఆర్ఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు డి.యం. ఓబులేసు యాదవ్ డిమాండ్

**చెన్నూరు మేజర్ న్యూస్:** చెన్నూరు మండలంలో ఉన్న శ్రీ భారతి గుర్తింపు తక్షణమే రద్దు చేసి యాజమాన్యంపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని ఆర్ఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు డి.యం. ఓబులేసు యాదవ్ డిమాండ్ చేశారు.శనివారం చెన్నూరులో ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలను పూర్తిగా తుంగలోకి తొక్కి ఇష్ట రాజ్యంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. భారతి పాఠశాల లోనే పాఠ్య పుస్తకాలు, యూనిఫామ్, టై,షూ ఇతర మెటీరియల్ అంతా కూడా అమ్మకానికి పెట్టారని తెలిపారు. ఇంటర్,డిగ్రీ పూర్తి చేసిన వారిని ఉపాధ్యాయులుగా పెట్టుకొని మేము నాణ్యమైన విద్యను అందిస్తున్నామని మోసపూరిత ప్రకటనలతో,హామీలతో అక్రమ అడ్మిషన్స్ చేస్తున్నారని తెలిపారు.స్కూల్ వ్యాన్లో 13 సీట్లు ఉంటే 70 మంది విద్యార్థులు ఎక్కించడం ఏమిటనీ వారు ప్రశ్నించారు. ఆళ్లగడ్డలో



ప్రైవేట్ స్కూల్ వ్యాన్ ఒక్క విద్యార్థి ప్రాణం బలియ్యిందని గుర్తు చేశారు. వేల రూపాయలు ఫీజులు తీసుకుంటూ విద్యార్థులకు ఏ మాత్రం రక్షణ లేకుండా శ్రీ భారతి స్కూల్ నడుపుతున్నారని తల్లిదండ్రులారా ఒక్కసారి ఆలోచించండి మీ బిడ్డల రక్షణ వున్నా పాఠశాలలోనే చేర్పించాలని అర్ఎస్ఎఫ్ విజ్ఞప్తి చేస్తుందని ఇప్పటికైనా జిల్లా విద్యాశాఖ అధికారులు నిద్ర వీడి తక్షణమే శ్రీ భారతి స్కూల్ పై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

# పొలతల దేవస్థానం భూముల వేలం

**పెండ్లిమర్రి మేజర్ న్యూస్** పెండ్లిమర్రి మండలం గంగనపల్లి గ్రామం కొలతల క్షేత్రంలో శ్రీ మల్లేశ్వర స్వామి దేవస్థానమునకు సంబంధించిన భూములను 09.07.2025. తేదీ బుధవారం మధ్యాహ్నం 2-00 గంటలకు సదరు దేవస్థానం నందు దేవాదాయ ధర్మాదాయ శాఖ అధికారుల సమక్షంలో బహిరంగ వేలము ద్వారా కౌలుకు ఇవ్వబడునని, వేలము లో పాల్గొనదలచిన ప్రతి పాటదారుడు వేలమునకు ముందు ధరావత్తు రూ.. 1000 చెల్లించి పాటలో పాల్గొనవలెనని పాట ఆఖరు హెచ్చుపాటదారుడు తరావతు తప్ప మిగిలిన వారి ధరావత్తులు వాపసు ఇవ్వబడునని అలాగే దేవస్థానమునకు ఏ విధమైన బకాయిలు గాని లావాదేవీలు గాని ఉన్నవారు పాటలో పాల్గొనుటకు అనర్హులని హెచ్చు పాటదారుడు వేలంపాట పూర్తి అయిన వెంటనే మునుగుత్త చెల్లించి భూమిలో ప్రవేశించవలెనని ప్రతి సంవత్సరము మార్చి నెలాఖరులోపు ముని గుత్త చెల్లించి భూమిలో దిగ వలెనని, అట్లు చెల్లించని ఎడల ఏ నోటీసు నిమిత్తము లేకుండా సదరు భూమిని తిరిగి బహిరంగ వేలం పెట్టబడునని, కౌలు కాలం మూడు సంవత్సరములకు అనగా 2025- 2026 నుండి 2027- 2028 వరకు నిర్ధారించడమైనదని మిగిలిన షరతులు వేలం నందు తెలవబడునని దేవస్థానం ఈ.వో. ఎం. కృష్ణ నాయక్ పత్రికా ముఖంగా పేర్కొన్నారు.

# పెంచిన విద్యుత్ చార్జీలను, స్మార్ట్ మీటర్ల ఏర్పాటును ఉపసంహరించుకోవాలి



**ఎర్రగుంట్ల మేజర్ న్యూస్:** పెంచిన విద్యుత్తు సర్దుబాటు చార్జీలను తగ్గించాలని స్మార్ట్ మీటర్ల ఏర్పాటును ఉపసంహరించుకోవాలని సిపిఐ మండల కార్యదర్శి శరత్ కుమార్ అన్నారు .ఈ మేరకు శనివారం ఎర్రగుంట్ల విద్యుత్ శాఖ కార్యాలయంలో అసిస్టెంట్ ఇంజనీర్ కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే విద్యుత్ ఛార్జీలు తగ్గిస్తామని , స్మార్ట్ మీటర్లు రద్దు చేస్తామని, విద్యుత్ రంగంలో ఆదాయం చేసుకున్న ఒప్పందాలు అన్నింటిని రద్దు చేస్తామని ఎట్టి పరిస్థితుల్లో విద్యుత్ ఛార్జీలు పెంచబోమని ఎన్నికల హామీలు చెప్పారన్నారు. అధికారం చేపట్టగానే విద్యుత్ సర్దుబాటు చార్జీల పేరుతో దాదాపు రూ.15 వేల కోట్లు పైగా ప్రజలపై భారం మోపుతున్నది అన్నారు అంతేకాకుండా ఇండ్లకు కూడా స్మార్ట్ మీటర్లను బిగించాలనే ప్రయత్నాలు చేస్తుందని విద్యుత్ సర్దుబాటు చార్జీలు పెంచడం , ఇండ్లకు స్మార్ట్ మీటర్లను బిగించడం ప్రజలను మోసం చేయటమే అవుతుందన్నారు . ఆదాని కంపెనీతో చేసుకున్న విద్యుత్ ఒప్పందాలులో అవకతవకలు ,అవినీతి అక్రమాలు జరిగాయని ఒప్పందాలన్నీ రద్దు చేస్తామని చెప్పి నేటికీ ఒప్పందలు రద్దు చేయకుండా వాటిని కొనసాగిస్తూ ఆదాని విద్యుత్ సంస్థలకు లాభదాయకంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తున్నట్లు స్పష్టంగా కనిపిస్తుందన్నారు. నిత్య జీవితంలో కార్యకలాపాలు కొనసాగాలన్న , అభివృద్ధి జరగాలన్న విద్యుత్ అనేది అత్యంత కీలకపాత్ర ఉందన్నారు. విద్యుత్తు చార్జీలు పెంచితే ప్రతి వస్తువు పైన కూడా ధరలు పెరుగుతాయి, దీంతో ప్రజలు పై తీవ్ర భారం పడుతుంది కావున విద్యుత్ సర్దుబాటు చార్జీలను తగ్గించాలని ఇండ్లకు స్మార్ట్ మీటర్ల ఏర్పాటును ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. సిపిఐ నాయకులు సుధీర్ తో పాటు ఇతరులు పాల్గొన్నారు.

# ఎస్.కె విద్యా సంస్థలు సైన్స్ ఫీస్ట్



**కలసపాడు మేజర్ న్యూస్** కలసపాడులోని ఎస్.కె మెమోరియల్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో శాస్త్ర విజ్ఞాన ఉత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ ప్రదర్శనలో యూ.కే.జీ నుండి 10 వ తరగతి వరకు విద్యార్థులు ఆసక్తిగా పాల్గొన్నారు. ముఖ్య అతిథిగా కలసపాడు మండల విద్యాధికారి మస్తాన్ వలి, యస్. కె విద్యాసంస్థల చైర్మన్ అఫ్రోజ్ షేక్, కళాశాల సీ.ఈ.ఓ షేక్ హెచ్.ఎం ఖాద్రి పాఠశాల ప్రధాన ఉపాధ్యాయుడు బాసు, మురళి మోహన్ రెడ్డి, సైన్స్ ఉపాధ్యాయుడు రాజారెడ్డి, ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు మరియు సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

# సార్వత్రిక సమ్మెని జయప్రదం చేద్దాం

## - ఏఐటియూసి నేత బాదుల్లా




**వేంపల్లె మేజర్ న్యూస్:** కార్మిక హక్కులను ఉల్లంఘిస్తున్న కేంద్రంలోని బిజెపి ప్రభుత్వానిక వ్యతిరేకంగా నిర్వహిస్తున్న సార్వత్రిక సమ్మెని జయప్రదం చేద్దాం అని ఏఐటియూసి జిల్లా డిప్యూటీ జనరల్ సెక్రటరీ కెసి.బాదుల్లా పిలుపునిచ్చారు. శనివారం భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు బల్లారపు రామాంజనేయులు తో కలిసి సంబంధిత కరపత్రాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆధునిక బానిసలుగా మార్చే విధంగా మోడీ ప్రభుత్వం కార్మిక చట్టాల్లో మార్పులు చేసిందన్నారు. ఆ మార్పులు వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కార్మికులు పోరాడి సాధించిన 29 చట్టాలను నాలుగు లేబర్ కేడ్ లుగా పెట్టుబడి దారులకు అనుకూలంగా మార్చరాని మండిపడ్డారు. ఎనిమిది గంటల పనిని 12 గంటలకు పెంచడం దుర్మార్గం అన్నారు. కనీసం వేతనం కల్పించాలని ఒకవైపు కార్మిక స్కీమ్ వర్కర్లు కోరుతుంటే మరోవైపు పని గంటలు పెంచడం శోచనీయమన్నారు. అలాగే ఎన్నికల ముందు ఏపి సిఎం చంద్రబాబు భవన నిర్మాణం సంక్షేమ బోర్డును పునరుద్ధరిస్తామని నమ్మబలికి, పెట్టుబడి దారులకు అనుకూల విధానాలు అవలంభిస్తున్నట్లు ఆవేదన వెలిబుచ్చారు. ఈ కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం కార్యదర్శి చల్లా బాలాజీ, ఉపాధ్యక్షుడు చలపతి, బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

# అనాథల పట్ల శ్రద్ధ వహించాలి

## సర్పంచ్ రాచినేని శ్రీనివాసులు

## కసిరెడ్డి ఇంద్ర జయంతి సందర్భంగా వృద్ధులకు అల్పాహారం



**వేంపల్లె మేజర్ న్యూస్:** సమాజంలోని నిరాశ్రయులైన అనాథల పట్ల శ్రద్ధ చూపాల్సిన అవసరం ఉందని వేంపల్లె గ్రామ పంచాయతీ సర్పంచ్ రాచినేని శ్రీనివాసులు అన్నారు. శనివారం వైఎస్ఆర్సీపి కార్యకర్త కసిరెడ్డి ఇంద్రసేనారెడ్డి జయంతి సందర్భంగా స్థానిక మథర్ థెరిస్సా ఛారిటబుల్ ట్రస్ట్ వృద్ధాశ్రమంలో అనాథ వృద్ధులకు అల్పాహారం ఏర్పాటు చేశారు. పుల్లయ్యతోట ప్రాంతానికి చెందిన నగేష్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో సర్పంచ్ చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ తమ మధ్య కసిరెడ్డి ఇంద్రసేనారెడ్డి లేనప్పటికి, తన జ్ఞాపకార్థాలు ఎల్లప్పుటికీ గుర్తుండిపోతాయన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్సీపీ మాజీ రాష్ట్రనేత రాచినేని వేణుగోపాల్, జిల్లా నేత కసిరెడ్డి ఆదినారాయణ రెడ్డి, వాసుదేవరెడ్డి, బ్రహ్మ, భూషణం, దివాకర్ రెడ్డి, యోగ, గౌతమ్, రామకృష్ణారెడ్డి, శివ, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# ముగిసిన తిరుమల తిరుపతి దేవస్థానం వారి ధార్మిక కార్యక్రమాలు



**బ్రహ్మంగారిమఠం మేజర్ న్యూస్** మండల కేంద్రం,పాతూరు గ్రామంలోని శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి నివాసం వద్ద ఉన్న రామాలయం నందు ఈనెల ఒకటవ తేదీన ప్రారంభమైన టిటిడి వారి ధార్మిక కార్య క్రమాలు ఘనంగా శనివారంతో ముగిసాయి. ఈ కార్యక్రమంలో టీటీడీ ప్రచారకర్త చాపాడు వెంకట సుబ్బారెడ్డి చేసిన ధార్మిక ప్రసంగం భక్తులను ఆకట్టుకుంది.అలాగే శుక్రవారం నిర్వహించిన కుంకుమ పూజ కార్యక్రమానికి మహిళలు భక్తిశ్రద్ధలతో పెద్ద ఎత్తున పాల్గొని పరవశింప చేశారు.అలాగే భజనలు కూడా నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమాలు ప్రోగ్రా%శీ% అసిస్టెంట్ టి.గోపిబాబు ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది.టీటీడీ వారు నిర్వహించిన కార్యక్రమాలకు గ్రామస్తులు ధన్యవాదాలు తెలియజేశారు. కార్యక్రమంలో తిప్పన రోశమ్మ, తిప్పన మాధవ నాయుడు, గోవిందాయపల్లె శ్రీరాములు,సారె వెంకటేశ్వర్లు, ఇటికెల రవికుమార్, తిప్పన రవితేజ, రమేష్ పాల్గొన్నారు.

# పండుగ వాతావరణంలో ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని జరుపుకుందాం

## మాదిగ ఉద్యోగుల సమాఖ్య జాతీయ నాయకులు ఓబులాపురం శోభన్‌కుమార్




**కలసపాడు మేజర్ న్యూస్:** కలసపాడు ఆర్ సి ఎం చర్చి ఆవరణలో మాదిగ దండోరా జెండాల పంచిణీ కార్యక్రమాన్ని మాదిగ ఉద్యోగుల సమాఖ్య జాతీయ కార్యవర్గ సభ్యులు ఓబుళాపురం శోభన్ కుమార్ ఘనంగా నిర్వహించారు. ప్రతి గ్రామంలో, ప్రతి వూరిలో ఉద్యమ జెండా ఎగురవేస్తూ, మాదిగ ఉద్యమ శక్తిని మరింత ముందుకు తీసుకెళ్లాలని ఆయన కోరారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూఎస్సీ వర్గీకరణ సాధన కోసం మందకృష్ణ మాదిగ గారి నేతృత్వంలో స్థాపించబడిన ఎమ్మార్పీఎస్ ఉద్యమం మాదిగల హక్కులకు, గుర్తింపుకు, గౌరవానికి మార్గదర్శిగా నిలిచిందన్నారు. జులై ఏడున ఆవిర్భావ దినోత్సవాన్ని మరియు పద్మశ్రీ మందకృష్ణ మాదిగ గారి జన్మదిన వేడుకలను ప్రతి కుటుంబంలో పండుగలా జరుపుకోవాలని. యువత ఉద్యమ స్ఫూర్తితో చైతన్యవంతం కావాలన్నారు. ఒక్కొక్క మాదిగ జెండా పైకి ఎగురవేస్తే న్యాయం తప్పకుండా సాధ్యం అవుతుంది అని స్పష్టం చేశారు.మాదిగల ఐక్యతకు ప్రతీకగా, సమానత్వం, స్వాభిమానం సాధనకు చిహ్నంగా మాదిగ దండోరా జెండాలను గౌరవిస్తూ గుండెకు హత్తుకుని ఎగురవేస్తూ గ్రామాల్లో, కాలనీల్లో, ప్రతి గడపలో ఉద్యమ భావజాలాన్ని వ్యాపింపజేయాలని పద్మశ్రీ మందకృష్ణ మాదిగ అడుగుజాడల్లో ముందుకు సాగాలని ఆయన పిలుపునిచ్చారు.మండల స్థాయిలో, గ్రామ స్థాయిలో జెండా ఆవిష్కరణలు, ర్యాలీలు, సభల ద్వారా ఆవిర్భావ దినోత్సవాన్ని ఉత్సాహభరితంగా జరిపేలా కార్యాచరణ రూపొందించుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ కడప జిల్లా ఇన్చార్జి మరియు జాతీయ కోర్ కమిటీ సభ్యులు గుండాల ఈశ్వరయ్య మాదిగ, పోరుమామిళ్ళ మండల ఇన్చార్జి నర్సింహులు మాదిగ, కో ఇన్చార్జి మనోజ్ సాగర్, మాదిగ ఉద్యోగుల సమాఖ్య నాయకులు జాకోబ్, ప్రసాద్, ఆనంద్, బాల ఓబయ్య, తదితరులు పాల్గొన్నారు.

# ఒకవైపు సంక్షేమం, మరోవైపు అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తోన్న కూటమి పాలన



**ప్రొద్దుటూరు, మేజర్ న్యూస్:** ఒకవైపు సంక్షేమం, మరోవైపు అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తూ కూటమి పాలన సాగుతోందని మాజీ ఎంపీపీ నంద్యాల రాఘవరెడ్డి తెలిపారు. శనివారం ఎమ్మెల్యే వరదరాజుల రెడ్డి పిలుపు నంద్యాల వరదరాజులరెడ్డి మేరకు మున్సిపాలిటీ పరిధిలోని 40 వార్డు నందు సుపరిపాలనలో తొలి అడుగు ఇంటింటి ప్రచార కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు ఇంటింటికి తిరుగుతూ ప్రజలకు అందుతున్న సంక్షేమ పథకాలు గురించి అడిగి తెలుసుకుంటూ, ఏడాదిగా ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలను ఇంటింటికి వెళ్లి ప్రజలకు వివరించారు. సందర్భంగా మాజీ ఎంపీపీ నంద్యాల రాఘవరెడ్డి మాట్లాడుతూ ఏ ప్రభుత్వం అయినా తొలి సంవత్సరంలోనే ఇచ్చిన హామీలన్నీ పూర్తి స్థాయిలో అమలు చేయడం సాధ్యం కాదని తెలిపారు. గత ప్రభుత్వం 1000 రూపాయల ఫించన్ 5 సంవత్సరాల పాటు పెంచిన విషయం గుర్తు చేసుకోవాలన్నారు. గతంలో వారు రోడ్ల నిర్మాణాన్ని గాలికొదిలేశారని, కానీ కూటమి ప్రభుత్వం రోడ్ల నిర్మాణం, అమరావతి, పోలవరం, ఒకవైపు సంక్షేమం, మరో వైపు అభివృద్ధి చేస్తోందని, ఇది చూసి ఓర్వలేకే వైసీపీ నాయకులు విమర్శలు చేస్తున్నారని వివరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ బచ్చల పుల్లయ్య, నంద్యాల ఆనంద్ భార్గవ్ రెడ్డి, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ జాబిబుల్లా, కొత్తపల్లె సర్పంచ్ కొనిరెడ్డి శివచంద్రారెడ్డి, స్థానిక నాయకులు మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ వెంకట కొండయ్య, బాబు, అంజనమ్మ, బోగా శివకళ్యాణి, హైమవతి, బోగా బాల వీరయ్య, గంజికుంట అంజి, సిద్దయ్య, రాష్ట్ర వక్ఫ్ బోర్డు డైరెక్టర్ బేపారి జాకీర్, జిల్లా ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు బద్వేలు శ్రీనివాసుల రెడ్డి, టౌన్ బ్యాంక్ చైర్మన్ బొగ్గుల సుబ్బారెడ్డి, బిసి నాయకులు చల్లా రాజగోపాల్ యాదవ్, వద్ది బాలుడు, బచ్చల ప్రతాప్, మున్సిపల్ కౌన్సిలర్లు మురళీధర్ రెడ్డి, కంకర గౌస్, మునీర్, కమాల్ బాషా, మోతుకూరి బాల, పల్లా సురేష్, ఘంటసాల వెంకటేశ్వర్లు, తలారి పుల్లయ్య, తాటి శ్రీనివాసులు యాదవ్, బేపారి గౌస్ బాషా, రసూల్ గౌస్, ఎర్రన్న, లక్ష్మణ్, కూటమి నాయకులు, కార్యకర్తలు, నందమూరి అభిమానులు పాల్గొన్నారు.

# సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో మూడవరోజు



**బద్వేల్ మేజర్ న్యూస్..** సుపరి పాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా మూడవ రోజు యువ నాయకుడు బద్వేల్ టిడిపి నియోజకవర్గ ఇంచార్జ్ రితీష్ రెడ్డి , బిజెపి నాయకుడు బొజ్జ రోషన్న ఆధ్వర్యంలో మున్సిపాలిటీ పరిధిలోని 23వ వార్డులో వార్డులో ఇంచార్జ్ మహబూబ్ బాషా (బిగ్ బాస్) తెలుగు యువత జిల్లా ఉపా ధ్యక్షులు జహంగీర్ భాష ఆధ్వర్యంలో సుపరి పాలన తొలిగడుగు కార్యక్రమాన్ని నిర్వహిం చారు ఈ సందర్భంగా టిడిపి నియోజకవర్గ ఇన్చార్జ్ రెడ్డి వార్డులో పర్యటించి రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడిన ఏడాది పాలనలో ప్రజల కు సుపరిపాలన అందించామని వయో వృద్ధులకు పింఛన్లు తల్లికి వందనం డీఎస్సీ సూపర్ సెక్స్ లో భాగం కార్యక్రమాలు చేపట్టి నామన్నారు . వార్డు పరిధిలోని ప్రతి ఇంటికి రాష్ట్ర ప్రభుత్వం నుంచి వచ్చే పథకాలు వస్తున్నాయా లేదా అని అడిగి ప్రజలకు వివరించ అనంతరం మీ వార్డులో ఏవైనా సమస్యలు ఉంటే మహబూబ్ బాషా (బిగ్ బాస్) తెలుగు యువత జిల్లా ఉపాధ్యక్షులు జహంగీర్ భాష ద్వారా పరిష్కరించుకోవచ్చు తెలిపా రు. అదేవిధంగా వార్డు పరిధిలో శానిటేషన్ పింఛన్లు పలు రకాల సమస్యలు ఆయన దృష్టికి తెలపడంతో ఆయన వెంటనే స్పందించి ఆయన వెంట ఉన్న మున్సిపల్ సిబ్బంది వివరాలు అడిగి తెలుసుకుని త్వరలో ఇలాంటి సమస్యలు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు న్యాయవాది పివిఎన్ ప్రసాద్ . భూపాలం రాఘవ రైస్ మిల్ ప్రసాద్ సింగ సాని బుజ్జి వడ్లపూటి నాగభూషణం, శివయ్య స్వామి. నగర మైనార్టీ అధ్యక్షులు పిఆర్పీ భాష నగర అధ్యక్షులు వెంగల్ రెడ్డి బద్వేల్ మండల అధ్యక్షులు టీవీఎస్ రవి సుబ్బారెడ్డి , మనోజ్ స్వామి రైస్ మిల్ ప్రసాద్ యువ నాయకులు మాచుపల్లి కృష్ణారెడ్డి హబీబ్ మస్తాన్ బాబు, ఇంటింటికి వెళ్లి సంక్షేమ పథకాల అమలును వివరిస్తూ ప్రజల సమస్యలను అడిగి తెలుసుకోవడం జరిగింది.

# ఆశా కార్యకర్తల పోస్ట్‌లకు దరఖాస్తు చేసుకోండి

**దువ్వూరు, మేజర్ న్యూస్ :**మండల కేంద్రమైన దువ్వూరు లోని దువ్వూరు 1 సచివాలయంకు ఒక పోస్ట్, దువ్వూరు 2, సచివాల యంకు ఒక పోస్ట్ కాలిగా వున్నవి అని వాటికి దరఖాస్తు చేసుకోవచ్చని ప్రభుత్వ ప్రాథమిక వైద్యాధికారి డాక్టర్ సురేష్ బాబు పేర్కొన్నారు. శనివారము డాక్టర్ సురేష్ బాబు హాస్పిటల్ నందు మాట్లాడుతూ రెండు ఆశా కార్యకర్తల పోస్టులకు ఆ సచివాలయం పరిధి లోని వివాహము అయిన మహిళలు, పదవ తరగతి పాసైనవారు,25 సంవత్సరాల నుండి 45 సంవత్సరాలలోపు వయసు వున్న వారు అర్హులు అని తెలిపారు. దరఖాస్తు ఫారం పూర్తి చేసి ఈ నెల 8వ తేది సాయంత్రం 04.00 గంటల లోపల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం దువ్వూరు నందు అందచేయ వలెను అని తెలిపారు. సమాచారం కొరకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సంప్రదించాలని తెలిపారు.

# ఉక్కు కల సాకారం అయ్యేనా!

### కడప ఉక్కు పరిశ్రమపై పాలకుల మాటలు నీటిపై రాతలు

### ఆర్ సి పి రాష్ట్ర కార్యదర్శి రవిశంకర్ రెడ్డి

**కడప ప్రతినిధి - మేజర్ న్యూస్ :** కడప జిల్లాలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు కోసం ముగ్గురు ముఖ్యమంత్రులు నాలగు శిలాఫలకాలు వేశారే తప్ప, పరిశ్రమకు సంబంధించి ఒక్క ఇటుక కూడా పేర్చలేదని ఉక్కుపరిశ్రమ శిలాపలకాలకే పరిమితం అయిందని, పాలకుల మాటలు నీటిపై రాసిన రాతల మారాయని, రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర కార్యదర్శి రవిశంకర్ రెడ్డి అన్నారు. ఆర్సీపీ 360 రోజుల ఉక్కు దీక్షలకు 8 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా కోటిరెడ్డి సర్కిల్ నందు జిల్లాలో ఉక్కు పరిశ్రమను పనులను వేగవంతం చేసి, కూటమి ప్రభుత్వం పూర్తి చేయాలని నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రవిశంకర్ రెడ్డి మాట్లాడుతూ... పాలకులలో కడప జిల్లాలో ఉక్కు పరిశ్రమలు ఏర్పాటు చేయాలన్న ఉక్కు సంకల్పమే వారికి ఉంటే! 20 సంవత్సరాల కాలం అయినప్పటికీ నేటికీ శిలాఫలకాలకే పరిమితం అయిందని, ఈ రకంగా పనులు నిర్వహిస్తే ఉక్కు పరిశ్రమ ఎప్పటికీ పూర్తవుతుందో! పాలకులు చెప్పలని, ఆయన ప్రశ్నించారు. జిల్లాలో ఉక్కు పరిశ్రమకు అవసరమైన ముడిసరకు సమృద్ధిగా ఉన్నయన్న విషయం ప్రభుత్వమే తేల్చిందని, పరిశ్రమను ఏర్పాటు చేయడంలోనే పాలకులు నిర్లక్ష్యం వహిస్తున్నారని, ఉక్కు పరిశ్ర మ ఏర్పాటు అయితే జిల్లాలో



కొంతవరకైనా నిరుద్యోగ సమస్య తగ్గుతుందని, ప్రత్యక్షంగా పరోక్షంగా వేలాది మందికి ఉపాధి దొరుకుతుందని ఆయన అన్నారు. 2008 జూన్ 30 తేదీన ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు ఉక్కు పరిశ్రమపై ఇచ్చిన మాటను ప్రస్తుత పాలనలో నిలబెట్టుకోవాలని, లేకపోతే భవిష్యత్తులో రాయలసీమ కడప జిల్లా ప్రజలు మిమ్మల్ని నమ్మరని, ఆయన తెలిపారు. కార్యక్రమంలో మడగలం ప్రసాద్, చాపల సుబ్బరాయుడు, లక్ష్మీదేవి, తస్లీమ్, వెంకటేశు, రవి, విజయ్, ప్రతాపరెడ్డి, ముని రెడ్డి, రాజు, తదితరులు పాల్గొన్నారు.

# రహదారి ప్రమాదాల నియంత్రణే లక్ష్యం

**కడప క్రైమ్ - మేజర్ న్యూస్:** ప్రతి శనివారం రోడ్డు భద్రత పై ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని పోలీసు అధి కారులకు కర్నూలు రేంజ్ డిఐజి డాక్టర్ కోయ ప్రవీణ్, జిల్లా ఎస్పీ ఇ.జి అశోక్ కుమార్ ఆదేశాలు జారీ చేశారు. వాహనదారులు రహదారి భద్రత నియమాలు పాటిస్తే రోడ్డు ప్రమాదాల నివారణ సాధ్యమవు తుందని తెలిపారు. ఈ సంధర్భంగా శనివారం జిల్లా వ్యాప్తంగా ఉన్న ఆయా పోలీసుస్టేషన్ పరిధులలో జిల్లా పోలీసు అధికారులు ప్రజలకు రోడ్డు భద్రత, ట్రాఫిక్ నిబంధనల పై సమావేశాలు నిర్వహించి, అవగాహన కల్పించారు. మైనర్లు వాహనాలు నడపకుండా తల్లిదం డ్రులు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. బైక్ లు నడిపే వారు



ఖచ్చితంగా హెల్మెట్లు ధరించే విధంగా , ఓవర్ స్పీడ్ , ఓవర్ లోడ్ తో వాహనాలు వెళ్ళకుండా, డ్రంకెన్ డ్రైవ్ చేయరాదని తదితర రోడ్డు భద్రత ప్రాముఖ్యతల పై ప్రజలకు అవగాహన కల్పించారు.

# భక్తిశ్రద్ధలతో స్వాతి నక్షత్ర సందర్భంగా అభిషేక పూజా కార్యక్రమాలు


**బద్వేల్ మేజర్ న్యూస్** కడప జిల్లా బద్వేల్ నియోజకవర్గం గోపవరం మండలం వల్లేరవారి పల్లె గ్రామం లో వెలసిన స్వయంభు శ్రీ లక్ష్మీనరసింహాస్వామి దేవస్థానం నందు ఆషాడమాసం ప్రారం భంతో రెండవ శనివారం నరసింహ స్వామి వారి జన్మ నక్షత్రం స్వాతి నక్షత్రం సంద ర్భంగా భక్తి శ్రద్ధలతో వేకువ జామునే స్వామి వారికి అభిషేకపూజా కార్యక్రమం ఆలయ ప్రధాన అర్చకులు పెంచలయ్య స్వామి ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు నిర్వహిం చారు. తదుపరి ఆషాడ మాసం స్వామివారి జన్మ నక్షత్రం కావడంతో స్వయంభు నరసింహస్వామికి అమ్మవారికి నెమలి పింఛములతో, తమలపాకులు, తులసి, పలు రకాల పుష్పాలతో దేవతా మూర్తులను ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం ఇచ్చారు, ప్రత్యేకమూగ అలంకరించిన దేవతామూర్తులను బత్తులు భక్తిశ్రద్ధలతో అనంతరం ఆలయ అర్చకులు స్వామివారి భక్తులు తమ నామ గోత్రాలతో పూజాది కార్యక్రమాలు ఈ సందర్భంగా స్వామి వారిని దర్శించుకున్న భక్తులు మాట్లాడుతు లక్ష్మీ నరసింహస్వామి గ్రామంలో స్వయంబుగా విలిసియున్నాడని స్వామి వారినిదర్శించు కోవడం వలన అనుకున్న పనులు కోరిన కోరికలు నెరవేరు తున్నాయని స్వామివారి ఆలయంలో ఉన్నంత సేపు మనసు ఎంతో ప్రశాంతముగా మనశ్శాంతి గాఉంటుందని వారుతెలిపారు. స్వామివారిని దర్శించుకున్న భక్తులకు అన్నదాన కైంకర్యం నిర్వహించిన



వారు నిర్వహించినవారు మాట్లాడుతూ స్వామివారిని దర్శించుకున్నప్పటినుంచి మా ఆర్థిక పరిస్థితులు అలాగే మా కన్స్ట్రక్షన్ సంస్థ అంతా కూడా చాలా మెరుగు పడినది అని గతముకంటే చాలా మేలు జరిగింది అని మా కోరిక నెరవేరటం వలన మేము స్వామి వారి ఆలయం దగ్గర అన్నదాన కైకరం నిర్వహిం చామని తెలియజేశారు, స్వాతి నక్షత్రం రోజున స్వామివారిని దర్శించుకోవ డం వలన ఋణ విముక్తి కలుగుతుందని ప్రగాఢ నమ్మకం అని వేద పండితులు తెలియజేశారు తదుపరి అన్నదాన కైంకర్యం నిర్వహించడం జరిగినది అన్నదాన కైంకర్యం నిర్వహించిన వారు బద్వేల్ పట్టణానికి చెందిన ప్రముఖ కన్స్ట్రక్షన్ కాంట్రాక్టర్ నారపురెడ్డి మధుసూదన్ రెడ్డి ధర్మపత్ని లక్ష్మీదేవి అన్న ప్రసాద వితరణ నిర్వహించారు.

# ఫలిత-ఆధారిత విద్యపై అవగాహన

## విజయవంతమైన వర్క్ షాప్



**వేంపల్లె, మేజర్‌న్యూస్:** ఇడుపులపాయ ఆర్కేవ్యాలీ ట్రిపుల్ ఐటీలో అంతర్గత నాణ్యత హామీ విభాగం ఆధ్వర్యంలో ఫలిత-ఆధారిత విద్యపై అవగాహన వర్క్ షాప్ నిర్వహించారు. జులై 4, 5 తేదిల్లో జరిగిన ఈ వర్క్ షాప్ విజయవంతంగా ముగిసింది. వర్క్ షాప్ కు నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎన్ఐటి) మెకానిక్ ఇంజనీరింగ్ విభాగధిపతి ప్రొఫెసర్ తంగెళ్లపల్లి శ్రీనివాస్ హజరై మెళకువలు గురించి వివరించారు. ఓబిఇ సూత్రాలు, అమలుపై అవగాహన పెంపొందించడమే లక్ష్యంగా విధ్యార్థులకు దిశ నిర్దేశించారు. ఓబిఇ ప్రధాన భావనలు, ఆధునిక విద్యలో దీని ప్రాముఖ్యత, పాఠ్యంశాల రూపకల్పన, మూల్యాంకన పద్ధతులు, ఆశించిన అభ్యాస ఫలితాలు సాధించడంపై అధ్యాపకుల పాత్ర లపైన సెషన్ అందించారు. ఆర్జియూకేటీ పరిధిలోని అన్ని క్యాంపస్ ల నుండి అధ్యాపక బృందం ఈ వర్క్ షాప్ లో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఆర్జియూకేటీ ఐక్యూఏసి డీన్ డా. కోటేశ్వరి, ఆర్కేవ్యాలీ ఐక్యూఏసి కోఆర్డినేటర్ డా. నాగరాజు లు పకడ్బందీగా నిర్వహించారు. ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ కుమారస్వామి గుప్తా తదితరులు పాల్గొన్నారు.

# దళిత గిరిజన జేపీసీ ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం

**పోరుమామిళ్ల, మేజర్‌న్యూస్ :** పోరుమామిళ్ల డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ భవనం నందు శనివారం దళిత గిరిజన జేపీసీ బద్వేల్ డివిజన్ చైర్మన్ ముత్యాల ప్రసాద్ రావుఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం జరిగినది. పోరుమామిళ్ల , బి కోడూరు కలసపాడు , కాశి నాయన మండలాలలోని ఎస్సీ ఎస్టీ చెందిన వారి భూములపైన, ఎస్సీ ఎస్టీలకు సంబంధించిన కేసులు పైన చర్చించడం జరిగింది. ముఖ్యంగా ఎస్సీ ఎస్టీ చెందిన భూములను మరొకరికి ఆన్లైన్ చేయడం జరిగిందని, చాలామంది భూములు కోల్పోయిన ఎస్సీ ఎస్టీ వారు ఈ సమావేశంలో పాల్గొని చర్చించడం జరిగింది. వారందరి సమస్యలను కమిటీలో చర్చించి జిల్లా అధికారులకు తెలియపరిచి న్యాయం చేస్తామని దళిత గిరిజన జేపీసీ హామీ ఇవ్వడం జరిగింది. అలాగే ఎస్సీ ఎస్టీ కేసులను నీరుగారుతున్న వివిధ పోలీస్ స్టేషన్లో వారి పైన జిల్లా ఎస్పీ దృష్టికి బద్వేల్ దళిత గిరిజన జేపీసీ తరుపున ఫిర్యాదు చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జేపీసీ ప్రధాన కార్యదర్శి గుడిమే . బాలస్వామి. రాయలసీమ మానవ హక్కుల సంఘం అధ్యక్షులు జేవి రమణ. దళిత వేదిక జిల్లా అధ్యక్షులు సి. ఓబయ్య. దళిత వేదిక జిల్లా మహిళా ఉపాధ్యక్షురాలు లక్ష్మి. వి. జయరాజు జిల్లా దళిత వేదిక



ప్రధాన కార్యదర్శి. బద్వేల్ డివిజన్ ఉపాధ్యక్షులు ముళ్లపాటి పిచ్చయ్య. బండి ఓబులేసు ఎస్సీ సెల్ టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు. బద్వేల్ దళిత గిరిజన జేపీసీ మెంబర్. ముత్యాల చెంద్రాయుడు .కలసపాడు మండలం మాల మహానాడు ఉపాధ్యక్షులు %ు% వర కుమార్ . కడుగు బాబు. వైయస్సార్సీపీ ఎస్సీ సెల్ జిల్లా కార్యదర్శి. దళిత యువజన నాయకులు పాల్గొనడం జరిగినది

# బాలల రక్షణ, హక్కులపై విద్యాశాఖ అధికారులతో సమీక్ష




**కడప ప్రతినిధి - మేజర్‌న్యూస్:**
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు బి. పద్మావతి ఆధ్వర్యంలో వైఎస్ఆర్ కడప జిల్లా న్యూ కలెక్టరేట్‌లోని సభా భవన్‌లో బాలల రక్షణ, బాలల హక్కుల అంశాలపై విద్యాశాఖ అధికారులతో శనివారం సమీక్షా సమావేశం నిర్వహించబడింది. ఈ సమావేశంలో మండల విద్యాధికారులు, ప్రైవేట్ మరియు ప్రభుత్వ పాఠశాలల హెచ్చాయిలు, కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాల ప్రిన్సిపాళ్లు, మోడల్ స్కూల్‌లు, డా. బి.ఆర్. అంబేద్కర్ గురుకుల పాఠశాలలు, ప్రైవేట్ మరియు ప్రభుత్వ జూనియర్ కాలేజీల ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు బి. పద్మావతి మాట్లాడుతూ, విద్యా సంస్థలు పిల్లల భద్రత, బాల కార్మిక వ్యతిరేకత, బాల్యవివాహాల నివారణ, డ్రాప్ అవుట్ విద్యార్థుల పునఃప్రవేశం, విద్యార్థులపై లైంగిక వేధింపుల నివారణ వంటి అంశాల్లో కీలకపాత్ర వహించాలన్నారు. పాఠశాల స్థాయిలో బాలల రక్షణ కమిటీలు సమర్థవంతంగా పనిచేయాల్సిన అవసరాన్ని హైలైట్ చేశారు. మిడ్ డే మీల్స్ మంచి నాణ్యతగా అందించాలని కోరారు. మత్తు పదార్థాల నివారణకు ప్రతి పాఠశాలలో ప్రహరీ క్లబ్ ను ఏర్పాటు చేసి, ప్రతి నెల తప్పని సరిగా మీటింగ్ ఏర్పాటు చేయాలని కోరారు. చైల్డ్ హెల్ప్ లైన్ 1098 నంబర్ ను ప్రతి పాఠశాలలో గోడల మీద పెయింటింగ్ వేయాలని తెలియజేశారు. విద్యార్థులకు చైల్డ్ హెల్ప్ లైన్ 1098 నంబర్ గురించి విరివిగా అవగాహన కల్పించాలని తెలియజేశారు.



# జాతీయ లోక్ అదాలత్‌లో జిల్లావ్యాప్తంగా 18 వేల కేసులు పరిష్కారం

**కడప క్రైమ్ - మేజర్‌న్యూస్ :** జాతీయ లోక్ అదాలత్ లో జిల్లావ్యాప్తంగా 18000 కేసులు పరిష్కారం అయ్యాయి. రూ.14.03 కోట్లు మొత్తము కక్షిదారులకు చెల్లించడం జరిగినది. జాతీయ న్యాయ సేవాధికార సంస్థ, గౌరవ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ ఆదేశానుసారంగా గౌరవ కడప జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా శనివారం జాతీయ లోక్ అదాలత్ నిర్వహించబడినది. జిల్లా వ్యాప్తంగా 24 బెంచీలు ఏర్పాటు చేయడం జరిగినది. కడప నందు 6, ప్రొద్దుటూరు నందు 3, రాజంపేట నందు 3, రాయచోటి నందు 3, బద్వేల్ నందు 3, లక్కిరెడ్డిపల్లి, రైల్వే కోడూర్, మైదుకూరు, జమ్మలమడుగు, పులివెందల మరియు కమలాపురం కోర్టుల నందు ఒక్కొక్క బెంచిని ఏర్పాటు చేయడం జరిగినది. జాతీయ లోక్ అదాలత్ లో జిల్లావ్యాప్తంగా 18000, కేసులు పరిష్కరించబడినవి. రూ.14,03,00,338 మొత్తము కక్షిదారులకు చెల్లించడం జరిగినది. జాతీయ లోక్ అదాలత్ లో న్యాయమూర్తులు మరియు లోక్ అదాలత్ మెంబెర్స్, కక్షిదారులు వారి వారి న్యాయవాదులతో సంప్రదింపులు జరిపి వారి వారి కేసులను పరిష్కరించుకోవడం జరిగినది. మెడికల్ క్యాంపు నిర్వహించడం జరిగినది. జాతీయ లోక్ అదాలత్ లో ఎక్కువ కేసులు రాజీ అయ్యే విధంగా కృషిచేసిన అందరికీ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ సి.యామిని, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి ఎస్.బాబా ఫక్రుద్దీన్ కృతజ్ఞతలు తెలిపారు.



# నేడు శ్రీ రామాపురం క్షేత్రంలో తొలి ఏకాదశి వేడుకలు

**కమలాపురం, మేజర్‌న్యూస్ :** పచ్చ తోరణాలతో నిత్య కళ్యాణ దేవత మూర్తులుగా విరాజిల్లుతున్న శ్రీ రామాపురం మహా పుణ్య క్షేత్రంలో ఆదివారం నాడు తొలి ఏకాదశి సందర్భంగా ఆలయ నిర్వాహకులు కాశీభట్ల సాయినాథ్ శర్మ ఆధ్వర్యంలో భక్తులకుఉత్తర ద్వారం దర్శనం ఏర్పాట్లు చేయనున్నారు. ప్రతి ఆషాఢ మాసంలో వచ్చే తొలి ఏకాదశి నాడు ఉత్తర ద్వారం ద్వారా భక్తులు శ్రీ మహా లక్ష్మి సమేత మోక్ష నారాయణ స్వా



మి ,శ్రీ వల్లి దేవసేన షణ్ముఖ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారిని దర్శించుకుంటే మహా పుణ్యఫలం దక్కుతుందని భక్తులు ఇక్కడ విశ్వసిస్తుంటారు. ఏకాదశి సందర్భంగా ఆలయంలో ఉదయం ప్రధాన దేవత మూర్తులకులి ప్రత్యేకమైన పూజలు అభిషేకాలు కళ్యాణం నిర్వహిస్తారు. సాయంత్రం గరుడ వాహనంపై మోక్ష నారాయణుడు మాడవీధుల్లో విహరిస్తారు. రేపు ప్రారంభమయ్యే తొలి ఏకాదశి గరుడ పురాణంలో ప్రత్యేకమైన ఏకాదశి కావున భక్తులందరూ ఉత్తర ద్వారం ద్వారా ప్రవేశించి దర్శించి దేవుని కృపకు పాత్రులు కాగలరని మనవి.

# నేడు శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి మఠంలో ఏకాదశి వేడుకలు

బ్రహ్మంగారిమఠం, మేజర్‌న్యూస్: జగద్గురు శ్రీమద్విరాట్ పోతులూరి శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి మఠంలో నేడు ఆదివారం తొలి ఏకాదశి వేడుకలు జరుగుతాయని పిట్ పర్సన్ శంకర్ బాలాజీ, మేనేజర్ ఈశ్వరయ్య ఆచారి తెలిపారు. ఈ సందర్భంగా శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి మఠాన్ని విద్యుత్ దీపాలంకరణలతో ముస్తాబు చేశారు. అలాగే నేడు శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి మఠంలో భజనలు, అన్నదాన కార్యక్రమం ఉంటాయని తెలిపారు. భక్తులందరూ శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి దర్శించుకుని స్వామి కృపకు పాత్రులు కాగలరని వారు కోరారు.

# దీక్షలో కూర్చున్న విద్యార్థులకు ఎస్ఎఫ్ఐ సంపూర్ణ మద్దతు

## తెలిపిన ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరపోగు రవి




కడప, మేజర్‌న్యూస్: శనివారం ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు గుజ్జుల వలరాజు, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరపోగు రవి మాట్లాడుతూ వైఎస్ ఆర్ అండ్ ఆర్కిటెక్ యూనివర్సిటీ పై కపట ప్రేమ మానుకోవాలని హంగర్ స్ట్రైక్ చేపట్టారు , వైయస్సార్ ఆర్కిటెక్ యూనివర్సిటీలో 500 మంది విద్యార్థులతో 13 డిపార్ట్మెంట్ లతో ఉన్నది అయితే ఆర్కిటెక్ విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడవద్దు 2020, 21, 22 విద్యా సంవత్సరానికి సంబంధించిన కౌన్సిల్ అఫ్ ఆర్కిటెక్ పరిమిషన్ ఇవ్వవలసి ఉంది, పది రోజుల్లో విద్యా సంవత్సరం పూర్తి అవుతున్న ఇంకా పర్మిషన్ లేకపోవడం పై విద్యార్థులు ఆందోళనతో అడుగుతుంటే యూనివర్సిటీ అధికారులు ఉన్నత అధికారులు అదిగో ఇదిగో అంటూ మోసం చేస్తూనే ఉన్నారు,పైగా ప్రభుత్వం యూనివర్సిటీ బిల్డింగులకు రెంటు కడుతుంటే వైస్ ఛాన్సర్ కాంట్రాక్టర్‌కి మధ్య విభేదాల కారణంగా విద్యార్థులు ఇబ్బంది పెడుతూ హాస్టల్ లేకుండా వికెట్ చేయమని ముందస్తు సమాచారం కూడా ఇవ్వకుండా చేయడం, ప్రతి ఒక్క విద్యార్థితో కాషన్ డిపాజిట్ కింద రూ.12 వేలు కట్టించుకొని ఈ విధంగా వ్యవహరించడం సరైంది కాదు అక్కడ అధ్యాపకులు కూడా మే నెల 21 వారి బోధిత సమయం పూర్తయి రెన్యువల్ లేని కారణంగా అధ్యాపకులు బోధించకుండా ఉన్నారు సందర్భంలో ఐదవ సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు ప్రాక్టికల్ వర్క్, పరీక్షలకు ఎలా వెళ్తారు, ఈ క్రమంలో ద్వితీయ ద్వితీయ సంవత్సర విద్యార్థులకు ఆన్లైన్ క్లాసులను చెప్పి ఇంటికి పంపించారు, మరి కొంతమందిని ఫీల్డ్ వర్క్ అని పంపించారు ఉన్న విద్యార్థులకు బోధించకుండా వ్యవహరిస్తున్నారు, ఈ కార్యక్రమానికి కడప ఆర్డీవో, యూనివర్సిటీ వైస్ ఛాన్సర్ విశ్వనాథ్ గారు, చెన్నూరు తహసిల్దార్, నిరసన శిబిరం వరకు వచ్చి విద్యార్థుల సమస్యలు పరిష్కరించుతామని కలెక్టర్ గారి దృష్టిలో ఉన్నదని వెంటనే విద్యార్థులు విరమించుకోవాలని తెలిపారు.